MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 296 | పేజీలు : 8 | గురువారం 15 అక్టోబర్ 2026 | వెల : 6-00



సౌదీలో దాడులు
వెంటనే ఆపాలి

- ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు'
- భారతీయులకు కేంద్రం అడ్వైజరీ
- హూతీ తిరుగుబాటు దారులు సౌదీలోని పౌర మౌలిక సదుపాయాలపై చేస్తున్న దాడుల్ని భారత్ ఖండించింది
- అక్కడి భారతీయులకు ఎంఈఏ కీలక మార్గదర్శకాలు జారీ

5



చైనాతో సంబంధాలు
సాధారణ స్థితికి రావాలంటే
వాస్తవాధీన రేఖ స్థిరంగా ఉండాలి

- సరిహద్దుల్లో ఎటువంటి అశాంతి చెలరేగినా దానికి పర్యవసానాలు ఉంటాయి
- విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం
- రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణ సరిహద్దు వద్ద శాంతితోనే ముడిపడి ఉన్నాయి



'స్థానిక' నగారా

మున్సిపల్, మండల, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- 13 నగర కార్పొరేషన్లు.. 77మున్సిపాలిటీలు
- 10 నగర పంచాయతీలు
- ఎన్నికల నోటిఫికేషన్ కూడా విడుదల
- రేపటి నుంచి 18వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- ఈ నెల 28న ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు
- నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్.. 5న ఓట్ల లెక్కింపు
- మూడు దశల్లో నవంబరు 26, 29, డిసెంబర్ 2న పంచాయతీ ఎన్నికల పోలింగ్
- నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్న ఎస్ఈసీ

అమరావతి, మహానగర్

మున్సిపల్, మండల.. జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ బుధవారం విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ షెడ్యూల్ విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 నగర కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలలో ఈ నెల 28వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్టు ప్రకటించారు. కోర్టు కేసుల కారణంగా ఎన్నికల ముందస్తు కార్యక్రమాలు పూర్తి కాని మరో నాలుగు కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు, నాలుగు నగర పంచాయతీల్లో డిసెంబర్ ఆఖరులో ఎన్నికలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు నవంబర్ 3న పోలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌ను మూడు విడతల్లో.. నవంబర్ 26, 29, డిసెంబర్ 3వ తేదీల్లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మూడు కేటగిరీల స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో పాటే బుధవారమే మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయా నగర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు వరకు నామినేషన్ల స్వీకరణ చేపడతారు. 28న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈ నెల 19వ తేదీన విడుదల చేయనున్నారు. మూడు దశల గ్రామ పంచాయతీ ఎన్నికలకు నవంబర్ 13, 16, 19వ తేదీల్లో వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేస్తారు. కాగా, నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని ఎస్ఈసీ తెలిపింది.

మున్సిపల్ ఎన్నికల తేదీలు

నామినేషన్ల స్వీకరణ : 16--10--2026 ఉదయం 11:00 గంటల నుంచి
నామినేషన్ల దాఖలకు చివరి తేదీ : 18--10--2026 మధ్యాహ్నం 3:00 గంటల వరకు
నామినేషన్ల పరిశీలన : 19--10--2026 - మిగతా2లో

ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన

5

జంతర్‌మంతర్ భారత ప్రజలది

- సీజేపీ నేతల కస్టడీపై విపక్షాలు ఫైర్
- సీజేపీ కార్యకర్తల జైలుకు పంపడంపై విపక్షాలు ఆగ్రహం
- యువతను జైలుకు పంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించాయి

5



స్వేచ్ఛగా, పారదర్శకంగా
స్థానిక ఎన్నికలు

- రాజకీయ పార్టీలు, అభ్యర్థుల సహకారం కూడా అవసరం
- తక్షణమే ఎన్నికల కోడ్ అమలులోకి
- అభ్యర్థులకు పూర్తి భద్రత కల్పించాలని పోలీసులకు ఆదేశం
- దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో కులధ్రువీకరణ, నోడ్యూస్ పత్రాలు ఇవ్వాలి
- మీడియాతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పునేఠ



అమరావతి, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్టు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠ చెప్పారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా బుధవారం విజయవాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన- మిగతా2లో



దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోంది

- అక్టోబర్ 14 నుంచి 16 వరకు దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న 'బృహత్తర భారత్
- ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు'ను ఉద్దేశించి పంపిన సందేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

5



బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

విజయవాడ, మహానగర్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానాన్ని సందర్శించి, శ్రీ మహాచండీదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రపతికి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతి భక్తులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను సైతం పలకరిస్తూ ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలోకి వెళ్లిన రాష్ట్రపతి - మిగతా2లో



పులివెందుల వైసీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీల



కడప : ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ, రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. తన సొంత అడ్డా పులివెందులకు అభ్యర్థిని ఖరారు చేశారు. పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ వైయస్ఆర్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ మనోహర్ రెడ్డి సతీమణి వైఎస్ ప్రమీలమ్మ పేరును జగన్ అధికారికంగా ప్రకటించారు. ఈ సారి కుటుంబసభ్యులకు కాకుండా బయట వారికి చాన్సిస్తారని ప్రచారం జరిగినా.. అలాంటి ధైర్యం చేయలేకపోయారు.మనోహర్ రెడ్డి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు మనోహర్ రెడ్డి.. జగన్‌కు బాబాయ్ వరుసవుతారు. అటు జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి వైపు నుంచి కూడా వీరికి బలమైన కుటుంబ బాంధవ్యాలు ఉన్నాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా పులివెందుల స్థానిక రాజకీయాలు, గ్రామీణ పంచాయతీల నుంచి మున్సిపాలిటీ వరకు అంతా మనోహర్ రెడ్డి కనుసన్నల్లోనే నడిచేది. వైఎస్సార్ హయాం నుంచే స్థానిక సంస్థల పెత్తనాన్ని గుత్తాధిపత్యంగా నడిపిస్తున్న ఆయన.. జగన్ కేంప్ కార్యాలయం, భారతి వ్యవహారాల్లోనూ తెరవెనుక కీలక చక్రం తిప్పుతూ వచ్చారు.పులివెందుల పురపాలక సంఘం చరిత్రను తిరగేస్తే.. ఈ దంపతుల చేతుల్లోనే స్థానిక అధికారం దశాబ్దాలుగా బందీ అయిందన్నది బహిరంగ రహస్యం. గతంలోనూ వైఎస్ ప్రమీలమ్మ పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. భర్త మనోహర్ రెడ్డి చక్రం తిప్పుతుంటే, భార్య ప్రమీలమ్మ చైర్‌పర్సన్ కుర్చీలో కూర్చుని నామమాత్రపు పాలన సాగించేవారు. మున్సిపాలిటీలో పనుల కేటాయింపులు, స్థానిక కాంట్రాక్టులు, వార్డుల నిర్వహణ అన్నీ వీరి కనుసన్నల్లోనే సాగాయి . పులివెందుల మున్సిపాలిటీలో నిజమైన ప్రజాస్వామిక ప్రాతినిధ్యం గానీ, కొత్త నాయకత్వానికి అవకాశం గానీ దక్కలేదు. పార్టీలో ఏళ్ల తరబడి జెండాలు మోసి, కేసులు ఎదుర్కొన్న సామాన్య కిందిస్థాయి కార్యకర్తలకు ఎప్పుడూ కార్పొరేటర్ లేదా వార్డు మెంబర్ టికెట్లే మిగిలాయి తప్ప.. కీలకమైన చైర్‌పర్సన్ కుర్చీ మాత్రం మళ్లీ తిరిగి ప్రమీలమ్మ ముంగిట్లోనే వాలింది.కడప ఎంపీగా అవినాష్ రెడ్డి, అసెంబ్లీలో జగన్, ఇప్పుడు మున్సిపాలిటీలో బాబాయ్ భార్య ప్రమీలమ్మ.. ఇలా స్థానిక నుంచి పార్లమెంట్ దాకా అధికారం అంతా నాలుగు గోడల మధ్యే ఉండాలన్న జగన్ ఆధిపత్య మనస్తత్వాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలోనే మెజారిటీ గణనీయంగా తగ్గిపోయి సొంత గడ్డపైనే పట్టు సడలిన సంకేతాలు కనిపించినప్పటికీ.. జగన్ మాత్రం కనీస మార్పునకు సిద్ధపడలేదు.ఈ సారి ప్రత్యక్ష ఎన్నిక కావడంతో .. టీడీపీ బలమైన మహిళా అభ్యర్థిని నిలిపే అవకాశం ఉంది.

విశాఖ మేయర్ పీఠంపై తెరపైకి
బాలయ్య కుమార్తె పేరు

విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశాఖపట్నం మేయర్ పదవికి ప్రత్యేక గుర్తింపు ఉంది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నగర ప్రాధాన్యం, భారీ బడ్జెట్ కారణంగా ఈ పదవిని దక్కించుకోవాలని రాజకీయ నాయకులు ఆసక్తి చూపుతుంటారు. తాజాగా మేయర్ పదవికి మహిళా రిజర్వేషన్ ఖరారైనట్లు ప్రచారం జరగడంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అధికార కూటమితో పాటు వైఎస్సార్‌సీపీ కూడా బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ముఖ్యంగా టీడీపీకి చెందిన ప్రముఖ కుటుంబాల మహిళల పేర్లు తెరపైకి రావడం ఆసక్తిని పెంచుతోంది.విశాఖ మేయర్ పదవి మరోసారి మహిళకు దక్కనుండటంతో మహిళా నాయకుల మధ్య పోటీ పెరిగే అవకాశం కనిపిస్తోంది. 2021లో జరిగిన మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బీసీ వర్గానికి చెందిన గొలగాని హరి వెంకట కుమారి బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు కూడా మహిళా అభ్యర్థికే అవకాశం ఉండటంతో పార్టీలు సామాజిక సమీకరణాలు, రాజకీయ బలాబలాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

ఈ క్రమంలో నందమూరి తేజస్విని పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆమె సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రెండో కుమార్తె. విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ సతీమణి కూడా. రాజకీయంగా ప్రభావం ఉన్న కుటుంబానికి చెందిన ఆమెను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టవచ్చనే ప్రచారం సాగుతోంది. గతంలో భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2029 ఎన్నికల్లో పోటీ చేస్తారనే ఊహాగానాలు కూడా వినిపించాయి. అయితే మేయర్ పదవికి పోటీ చేసే విషయంలో ఆమె ఆసక్తి, పార్టీ నిర్ణయం ఏమిటన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. ఆమె పేరు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చకు పరిమితమైంది.మరోవైపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ సతీమణి లావణ్య పేరు కూడా వినిపిస్తోంది. ఆమెకు అవకాశం దక్కుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. విశాఖ టీడీపీ అధ్యక్షుడు పట్టాభిరాం సతీమణి పేరును కూడా కొందరు ప్రస్తావిస్తున్నారు. జనసేన నుంచి పెద్దిశెట్టి ఉషశ్రీ, ఉత్తర నియోజకవర్గానికి చెందిన ఉషా కిరణ్ పేర్లు చర్చలో ఉన్నాయి. బీజేపీ నుంచి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కుటుంబానికి చెందిన మహిళ పోటీ చేస్తారా అన్నది కూడా రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది.వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ పేరు వినిపిస్తున్నప్పటికీ, ఆమె పోటీపై స్పష్టత లేదు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి పేరు కూడా ప్రచారంలో ఉంది. మాజీ ఎమ్మెల్యేల కుటుంబాల నుంచి కొత్త అభ్యర్థులు తెరపైకి వచ్చే అవకాశాలనూ కొట్టిపారేయలేం.మొత్తంగా విశాఖ మేయర్ పీఠం కోసం ప్రధాన పార్టీల్లో ఇప్పటి నుంచే కసరత్తు మొదలైనట్లు కనిపిస్తోంది. అయితే ప్రచారంలో ఉన్న పేర్లలో ఎవరికి పార్టీలు అవకాశం కల్పిస్తాయన్నది అధికారిక ప్రకటనల తర్వాతే తేలనుంది.



సామాజిక సమీకరణాలు, రాజకీయ పలుకుబడి, స్థానిక నాయకుల మద్దతు ఈ ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది.

సిద్ధిపేటలో రేవంత్ టూర్..
అప్రమత్తమైన హరీశ్!

సిద్ధిపేట

తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ యుద్ధం ముదురుతోంది. బీఆర్ఎస్ కీలక నేతల నియోజకవర్గాలను ప్రధాన లక్ష్యంగా చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి దూకుడు పెంచారు. ప్రత్యక్షంగా అక్కడికి వెళ్లడం, బహిరంగ సభలు నిర్వహించడం, తద్వారా స్థానిక నేతల అక్రమాలు, వైఫల్యాలను ఎండగట్టడం కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే సిరిసిల్ల పర్యటన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, తదుపరి అస్త్రాన్ని హరీశ్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేటపై ప్రయోగించడానికి సిద్ధమవుతున్నారు. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.ఇటీవల బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో కేటీఆర్‌కు సంబంధించిన ఆరోపణలు, అక్రమాస్తులు, హోటళ్ల అంశాలను రేవంత్ రెడ్డి బహిరంగంగానే ప్రస్తావించారు. ఈ ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ కలకలం రేపాయి. ఆ తర్వాత రేవంత్ రెడ్డి ప్రస్తావించిన ఆ హోటళ్లు తనవేనని కేటీఆర్ కూడా బహిరంగంగా అంగీకరించడంతో ఈ అంశం మరింత ఊపందుకుంది. ఈ క్రమంలోనే సిరిసిల్ల తరహాలోనే హరీశ్ రావు నియోజకవర్గమైన సిద్ధిపేటను కూడా టార్గెట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.సీఎం రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటన ఖాయమన్న సంకేతాలు వెలువడటంతో హరీశ్ రావు ముందుగానే అప్రమత్తమయ్యారు. తెలంగాణలో కొత్త జిల్లాలు ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా సిద్ధిపేటలో ఆయన భారీ సభ నిర్వహించారు. వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సభలు నిర్వహించాలని బీఆర్ఎస్ పిలుపునిచ్చినా మిగిలిన చోట్ల ఆశించిన స్పందన రాలేదు. కానీ హరీశ్ రావు మాత్రం దీన్ని తనకు అనుకూలంగా మలచుకోవడంలో సఫలమయ్యారు. ఈ సమావేశాన్ని తన రాజకీయ బలప్రదర్శనకు చక్కని వేదికగా ఉపయోగించుకున్నారు.త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి సిద్ధిపేటకు వస్తారని, తనపై తీవ్రస్థాయిలో విమర్శలు, ఆరోపణలు గుప్పిస్తారని హరీశ్ రావు ఈ సభలో ముందుగానే శ్రేణులకు వివరించారు. తనపై వచ్చే తుక్కు తుక్కు ఆరోపణలను నమ్మవద్దని ఆయన తన అభిమానులను, పార్టీ శ్రేణులను కోరారు. రేవంత్ రెడ్డి టార్గెట్ తనపైనే ఉంటుందని ముందే గ్రహించిన హరీశ్ రావు, కేడర్‌ను మానసికంగా సిద్ధం చేసే ప్రయత్నం చేశారు.కేవలం విమర్శలను తిప్పికొట్టడమే కాకుండా, అధికార పార్టీపై ఎదురుదాడికి కూడా హరీశ్ రావు ప్లాన్ చేశారు. సీఎం అయిన తర్వాత రేవంత్ రెడ్డి ఇప్పటివరకు సిద్ధిపేటకు రెండు సార్లు వచ్చినా, ఇక్కడ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. రేపు మరోసారి సీఎం వస్తే ఈ హామీల అమలుపై గట్టిగా నిలదీయాలని తన పార్టీ శ్రేణులకు, ప్రజలకు హరీశ్ రావు పిలుపునిచ్చారుమొత్తానికి, సీఎం రేవంత్ రెడ్డి రాకముందే సిద్ధిపేట వేదికగా హరీశ్ రావు రాజకీయ పావులు కదపడం, తనపై జరిగే దాడిని తిప్పికొట్టేందుకు ముందస్తు వ్యూహాలు రచించడం ఆసక్తికరంగా మారింది. సిరిసిల్లలో ఎదురైన పరిణామాల నుంచి గుణపాఠం నేర్చుకున్న బీఆర్ఎస్ నేతలు, సిద్ధిపేటలో ఎలాంటి వ్యూహాత్మక తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. రాబోయే రోజుల్లో సిద్ధిపేట వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మరింత తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

-మొదటిపేజీ తరువాయి

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. రాష్ట్రపతి సుమారు ఎనిమిది నిమిషాల పాటు అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆమెకు వేదాశీస్సులు అందజేసి ప్రసాదాలను సమర్పించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ అమ్మవారి చిత్రపటాన్ని రాష్ట్రపతికి బహూకరించగా, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అమ్మవారి శేషవస్త్రాలను అందజేశారు.

'స్థానిక' నగారా

-మొదటిపేజీ తరువాయి

ఉపసంహరణకు చివరి తేదీ : 21--10--2026 మధ్యాహ్నం 3 గంటల వరకు
పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ : 21--10--2026 మధ్యాహ్నం 3:00 గంటల తర్వాత
పోలింగ్ తేదీ: 28--10--2026 ఉదయం 7:00 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు
అవసరమైన చోట రీ పోలింగ్ : 29--10--2026 ఉదయం 7:00 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు
ఓట్ల లెక్కింపు : 30--10--2026 ఉదయం 8:00 గంటల నుంచి..
డిప్యూటీ మేయర్ లేదా డిప్యూటీ చైర్మన్ ఎన్నిక తేదీ : 05--11--2026

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల తేదీలు

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ : 19--10--2026
నామినేషన్ల స్వీకరణ మొదలు : 21--10--2026
నామినేషన్ల దాఖలకు చివరి తేదీ : 23--10--2026
నామినేషన్ల పరిశీలన : 24--10--2026
ఆపీళ్లు, పరిశీలన, తుది నిర్ణయం : ఈ నెల 25, 26 తేదీల్లో
ఉప సంహరణకు చివరి తేదీ : 27--10--2026
పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ : 27--10--2026
పోలింగ్ తేదీ : 03--11--2026
అవసరమైన చోట రీ పోలింగ్ : 04--11--2026
ఓట్ల లెక్కింపు : 05--11--2026
జెడ్పీ చైర్మన్ లేదా ఎంపీపీల పరోక్ష ఎన్నిక : 11--11--2026

ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, నగర కార్పొరేషన్లు

విశాఖపట్నం రీజియన్ : పలాస--కాశీబుగ్గ, బొబ్బిలి, యలమంచిలి, పాలకొండ, నెల్లిమర్ల, ఇచ్ఛాపురం, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్,పార్వతీపురం, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ), సాలూరు, నర్సీపట్నం.

రాజమండ్రి రీజియన్ : తుని, అమలాపురం, నిడదవోలు, మండపేట, నర్సాపూర్, జగ్గారెడ్డిగూడెం, కొవ్వూరు, సామర్లకోట, పెద్దాపురం, నందిగామ, నూజివీడు, ఉయ్యూరు, ముమ్మిడివరం, ఏలేశ్వరం, తిరువూరు, గొల్లప్రోలు, కొండపల్లి, ఆకివీడు, విజయవాడ, రామచంద్రపురం, ఏలూరు, పిఠాపురం, పెడన, మచిలీపట్నం, జగ్గయ్యపేట.

గుంటూరు రీజియన్

తెనాలి, రేపల్లె,అద్దంకి, చీమకుర్తి,కనిగిరి,గిద్దలూరు, వెంకటగిరి,ఆత్మకూరు, సూళ్లురుపేట, నాయుడుపేట,దర్శి, బుచ్చిరెడ్డిపాలెం, పిడుగురాళ్ల, గురజాల,దాచేపల్లి, మాచర్ల, గుంటూరు, నెల్లూరు, వినుకొండ, సత్తెనపల్లి, చిలకలూరిపేట, మార్కాపురం, ఒంగోలు, చీరాల.

అనంతపురం రీజియన్

హిందూపూర్, గూడూర్ (కర్నూలు), గుంతకల్లు, ఆదోని, ఎమ్మిగనూరు, పుంగనూరు, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు (నంద్యాల జిల్లా), ఆళ్లగడ్డ, గుత్తి, కల్యాణదుర్గం, మైదుకూరు, రాజంపేట, కుప్పం, బేతంచర్ల, పెనుకొండ, మదనపల్లె, మడకశిర, చిత్తూరు, అనంతపూర్, కర్నూలు, ప్రొద్దుటూరు, రాయచోటి, రాయదుర్గం, పుట్టపర్తి, బద్వేల్, నగిరి, పుత్తూరు, కడప, ధర్మవరం, తాడిపత్రి, నంద్యాల, ఎర్రగుంట్ల, కదిరి, జమ్మలమడుగు, పలమనేరు, తిరుపతి, పులివెందుల, కమలాపురం.

స్వేచ్ఛగా, పారదర్శకంగా స్థానిక ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడారు. షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణమే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్టు ప్రకటించారు. కోడ్ సమయంలో ప్రభుత్వం ఓటర్లను ప్రభావితం చేసేలా ఎలాంటి పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయకూడదని చెప్పారు. బ్యానర్ల ఏర్పాటు, విగ్రహాల విషయంలో పలు నియంత్రణలు అమలులోకి తెస్తున్నట్లు తెలిపారు. కోడ్ కాలంలో ఉద్యోగుల పదోన్నతులు, బదిలీ ఉండవని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలను పట్టిష్టంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసినట్టు వెల్లడించారు.

ఆన్‌లైన్ నామినేషన్లకు ఇప్పుడు సమయం లేదు

నామినేషన్ వేసే అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని జిల్లా పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లకు సమయం లేకపోవడంతో వచ్చే ఎన్నికల్లో ఆయా ఏర్పాట్లు చేయాలంటూ ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరు పోటీచేయడంలో ఏ ఇబ్బందులు తలెత్తకుండా అవసరమయ్యే కులధ్రువీకరణ పత్రాలను దరఖాస్తు చేసిన 24 గంటల్లో జారీచేయాలని జిల్లా యంత్రాంగాలను ఆదేశించినట్లు చెప్పారు. నోడ్యూస్ పత్రాలను కూడా 24 గంటలలోపే ఇవ్వాలని ఆదేశించామన్నారు. వీలైనంత మేర వాటిని అందజేస్తారన్నారు. పోలింగ్ జరిగే ప్రతి చోట సీసీటీవీల ఏర్పాటు ఖర్చుతో కూడిన ప్రక్రియ అని పేర్కొన్నారు. పోలీసుశాఖ సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినచోట సీసీటీవీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాజకీయ పార్టీ వినతుల మేరకు ఆ సీసీటీవీల పుటేజీ 60 రోజులు రిజర్వు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రతి జిల్లాలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమించే అబ్జర్వర్ల ద్వారా మద్యం నియంత్రణకు చర్యలు చేపడతామని చెప్పారు. ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలయ్యేలా అబ్జర్వర్లు చర్యలు చేపడతారని తెలిపారు.


ఎన్నికల సంఘం కొత్త ఓటర్ల జాబితాలు ఇస్తే వాటితోనే ఎన్నికలు

కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అందజేసిన ఓటర్ల జాబితాల ఆధారంగా ఎన్నికలకు ముందస్తు కార్యక్రమాలను పూర్తి చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో అక్టోబర్ నాటికి ఉన్న తాజా ఓటర్ల జాబితాలు కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆ జాబితాలను ఇస్తే కొత్త జాబితాలతోనే పోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. పోలింగ్ సమయానికి కొత్త జాబితాలు తమకు అందని పక్షంలో ఇప్పటికే తమవద్ద ఉన్న పాత ఓటర్ల జాబితాల మేరకు పోలింగ్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి మల్లిఖార్జున మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు, వినతుల కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వినతుల పరిష్కారానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మున్సిపల్‌శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణకు 4,027 మంది ఎన్నికల అధికారులు, వెయ్యిమంది ఎన్నికల స్క్వాడ్, 72 వేలమందిని ఎన్నికల సిబ్బందిని నియమించనున్నట్లు చెప్పారు. పోలింగ్ రోజు మున్సిపల్ సిబ్బంది పోలింగ్ స్టేషన్‌లో కూర్చోకూడదన్న నిబంధన ఉందని తెలిపారు. పోటీచేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు నామినేషన్ డిపాజిట్‌లో 50 శాతం రాయితీ ఉంటుందని ఆయన చెప్పారు.


శ్రీ మహాచండీదేవిగా కనకదుర్గమ్మ

ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు.. వైభవంగా ఆదిదంపతుల నగరోత్సవం

సాంస్కృతిక ప్రదర్శనలతో ఆధ్యాత్మిక శోభ.. భవానీ భక్తుల రాకతో పెరిగిన సందడి











విజయవాడ, మహానగర్

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన బుధవారం శ్రీ కనకదుర్గమ్మవారు శ్రీ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా, భవానీ మాలధారుల రాకతో కొండపై ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ప్రధాన ఆలయం పుష్పాలంకరణతో శోభిల్లగా, రాజగోపురం విద్యుద్దీపాల అలంకరణతో ఆకట్టుకుంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి దేవీ ఖడ్గమాలార్చన, చండీ హోమం, కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణార్చన తదితర ప్రత్యేక పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ప్రదోష వేళ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల నాల్గవ రోజు దివ్య నగరోత్సవం వైభవంగా జరిగింది. మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ కొబ్బరికాయ కొట్టి రథయాత్రను ప్రారంభించారు. విద్యుద్దీపాలు, సుగంధ పుష్పమాలికలతో అలంకరించిన రథంపై కొలువుదీరిన అమ్మవారు, స్వామివార్లను దర్శించుకునేందుకు పురవీధుల్లో భక్తులు బారులు తీరారు. నాదస్వరాలు, సన్నాయి మేళాలు, కేరళ పంచవాయిద్యాలు, శాక్సోఫోన్ మంగళనాదాలు, మహిళల కోలాటాలు, గరగ నృత్యాలు ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు కొబ్బరికాయలు సమర్పిస్తూ కర్పూర నీరాజనాలు పలికారు. అనంతరం రథయాత్ర ఇంద్రకీలాద్రికి చేరుకోగా, రాజగోపురం వద్ద వేద మంత్రోచ్ఛారణల నడుమ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, మంగళహారతులు సమర్పించారు. మరోవైపు కనకదుర్గా నగర్‌లోని ప్రత్యేక కళావేదికపై ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. టి. వెంకటేశ్వరరావు బృందం తాళ భజన, ఎం. రూప నాగ తేజస్వి, కె. జగన్మోహిని, పి. పరమేశ్వరి, యు. కల్యాణి హేమలత, కె. రుద్రాంక్షి భక్తిరంజని సంకీర్తనలు, దేవీ స్తోత్రాలు ఆలపించారు. ఎం. బాల సుందరం హరికథా గానంతో ఆకట్టుకోగా, పలువురు చిన్నారులు, యువ కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఇచ్చారు. భక్తులు క్యూలైన్లలో వేచి ఉంటూనే సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. కళాకారులను ఆలయ అధికారులు శేషవస్త్రాలు, ప్రసాదాలతో సత్కరించారు. ఉత్సవాల సందర్భంగా చండీ శ్లోక పఠనం, ప్రత్యేక పూజలు, నగరోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలతో ఇంద్రకీలాద్రి భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. నవరాత్రుల్లో ఆదిదంపతుల రథోత్సవాన్ని దర్శించుకుంటే సకల దోషాలు తొలగి, కుటుంబంలో శాంతిసౌఖ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

జాతీయ స్థాయిలో మన వైభవం





విజయవాడ ఉత్సవ్‌తో నగర సంస్కృతి, సంప్రదాయాలకు జాతీయ గుర్తింపు

ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కమలేష్ పాస్వాన్, ఎంపీలు లావు, కేశినేని చిన్ని



విజయవాడ, మహానగర్

నగర సాంస్కృతిక వైభవం, కళలు, సంప్రదాయాలను దేశవ్యాప్తంగా చాటిచెప్పే లక్ష్యంతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా పున్నమి ఘాట్ వేదికగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా వివిధ కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు సందర్శకులను అలరిస్తున్నాయి. విజయవాడ ఉత్సవ్‌తో పాటు జాతీయ స్థాయి సరస్ మేళా నిర్వహణ నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమాల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాస్వాన్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, పలువురు చైర్మన్లు, సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ ప్రతినిధి ముత్తవరపు మురళి, సినీ నటులు మురళీమోహన్, రాజా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమలేష్ పాస్వాన్ మాట్లాడుతూ విజయవాడలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయని, విజయవాడ ఉత్సవ్ 2.0 నిర్వహణ అభినందనీయమని పేర్కొన్నారు. తన మిత్రులు ఎంపీలు కేశినేని చిన్ని, లావు శ్రీకృష్ణదేవరాయలు ఆహ్వానం మేరకు నగరానికి రావడం సంతోషంగా ఉందన్నారు. దేశంలోని ప్రతి రాష్ట్రం, ప్రాంతం సంస్కృతి, సంప్రదాయాలు అభివృద్ధి చెందుతూ తగిన గుర్తింపు పొందాలన్నది ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని, ఇలాంటి కార్యక్రమాలు స్థానిక కళలను ప్రోత్సహించడంతో పాటు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో ప్రజలను భాగస్వాములుగా చేసి ఇంతటి భారీ ఉత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. విజయవాడలో దసరా వేడుకలను మైసూరు, కోల్‌కతా నగరాల ఉత్సవాల స్థాయిని మించి నిర్వహించాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. జాతీయ సరస్ మేళా గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తోందని, మహిళలు ఈ వేదికను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ జాతీయ సరస్ మేళాను విజయవాడకు తీసుకురావడంలో సహకరించిన కేంద్ర మంత్రి కమలేష్ పాస్వాన్‌కు నగర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీ తర్వాత జాతీయ స్థాయి సరస్ మేళాను విజయవాడలో నిర్వహించడం విశేషమని, దీనివల్ల డ్వాక్రా మహిళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో, సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నాయకుల సమష్టి కృషితోనే కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయని, విజయవాడ ఉత్సవ్ నిర్వాహకుల కార్యక్రమం మాత్రమే కాకుండా నగర ప్రజలందరూ భాగస్వాములై జరుపుకునే పండుగ అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారం ఉత్సవాల నిర్వహణకు దోహదపడుతోందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు ముఖ్యమంత్రులు ఉత్సవాలకు హాజరుకానున్నారని తెలిపారు. నగర సాంస్కృతిక వైభవానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, స్థానిక కళాకారులను ప్రోత్సహించడం, మహిళా సంఘాలకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం విజయవాడ ఉత్సవ్ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.

రాష్ట్రపతి చేతుల మీదుగా నేడు సరస్ మేళా ప్రారంభం



విజయవాడ, మహానగర్

కృష్ణా నది తీరంలోని పున్నమి ఘాట్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి సరస్ మేళా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈ నెల 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మేళా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఎంపీ కేశినేని చిన్ని బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. దేశవ్యాప్తంగా 480 స్వయం సహాయక సంఘాలకు చెందిన ఉత్పత్తులతో సరస్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఎంపీ తెలిపారు. మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం మేళా ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మహిళలు ఉత్పత్తుల తయారీ, విక్రయాల్లో స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని వివరించారు. మహిళలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామని, విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతోపాటు వారి ఆర్థిక అభివృద్ధికి సరస్ మేళా దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి మేళాకు ప్రధానమంత్రి ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఢిల్లీ తర్వాత విజయవాడలో జాతీయ స్థాయిలో సరస్ మేళా నిర్వహించడం విశేషమన్నారు. వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను పరిచయం చేసేలా ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దసరా నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు, ప్రజలు సరస్ మేళాను సందర్శించి మహిళా సంఘాల ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారిని ప్రోత్సహించాలని కేశినేని చిన్ని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 17, 18 తేదీల్లో తెలంగాణ ముఖ్యమంత్రి విజయవాడకు వచ్చే అవకాశం ఉందని, కర్ణాటక ముఖ్యమంత్రి కూడా మేళాకు హాజరుకానున్నారని తెలిపారు. సరస్ మేళా మహిళా సాధికారతకు, స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెంపునకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం

కేశినేని జానకి లక్ష్మి

90 మంది బాధితులకు రూ.1.63 కోట్ల సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీల పంపిణీ



విజయవాడ, మహానగర్

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఒక వరమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకి లక్ష్మి పేర్కొన్నారు. ఎంపీ కేశినేని చిన్ని చొరవతో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1.63 కోట్ల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)లను తిరువూరు నియోజకవర్గానికి చెందిన 90 మంది అర్హులైన బాధితులకు బుధవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో బుధవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేని పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎంతో ఊరట లభిస్తోందన్నారు. అర్హులైన ప్రతి బాధితుడికి ఆర్థిక సహాయం అందించేందుకు ఎంపీ కేశినేని చిన్ని నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ పాలన సాగిస్తున్నారని, ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన పేదలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి అలవాల రమేష్ రెడ్డి, దొడ్డ మాధవరావు, మండల టీడీపీ అధ్యక్షుడు దుబ్బాకు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ హుండీ ఆదాయం రూ. 1,20,62,105

మోపిదేవి, మహానగర్



ప్రముఖ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆధ్వర్యంలో మచిలీపట్నం డివిజన్ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు, మచిలీపట్నం భద్రాద్రి రామాలయం దేవస్థానం సెకండ్ గ్రేడ్ ఈఓ వై.శిరీష పర్యవేక్షణలో హుండీలను తెరిచి భక్తులు కానుకల రూపంలో అందించిన ఆదాయం లెక్కించారు. 105 రోజులకు సాధారణ హుండీల ద్వారా రూ.1,16,84,099లు, అన్నదానం హుండీ ద్వారా రూ.3,78,006లు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. మొత్తం హుండీ ఆదాయం రూ.1,20,62,105లుగా నమోదైంది. హుండీల ద్వారా ఒక కిలో 900 గ్రాములు వెండి, 69 గ్రాములు బంగారం, విదేశీ కరెన్సీగా అమెరికా 230 డాలర్లు, 70 ఆస్ట్రేలియా డాలర్లు, ఇరవై కెనడా డాలర్లు, పది ఇంగ్లాండ్ పౌండ్లు లభించాయి. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదన్ రావు, ఆలయ సిబ్బంది, మోపిదేవి స్టేట్ బ్యాంక్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

భారత్‌లో స్టార్‌లింక్ వివాదం

భారత్‌లో స్టార్‌లింక్ ఎంట్రీపై ఎలాన్ మస్క్ వ్యాఖ్యల కలకలం రేపుతున్నాయి. అంబానీపై విమర్శలు స్పెక్ట్రమ్ కేటాయింపులు, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి స్పందనలతో వివాదం ప్రారంభమయింది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, భారత పారిశ్రామిక దిగ్గజం ముఖేష్ అంబానీల మధ్య నడుస్తున్న వాణిజ్య పోరు సరికొత్త రాజకీయ, సామాజిక రచ్చకు దారితీసింది. భారత ప్రజలపై తమ ఏకఛత్రాధిపత్యాన్ని కాపాడుకోవడానికి కొందరు ఒలిగార్క్‌లు స్టార్‌లింక్‌ను అడ్డుకుంటున్నారు.. భారత్‌కు నిజమైన బాస్ అంబానీయేనా? అంటూ ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా విరుచుకుపడటంతో ఈ అంశం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే, ఈ ఆరోపణలు కేవలం ఒక వ్యాపార పోటీకి ప్రతిరూపమా లేక దేశీయ నియంత్రణలు, భద్రతా ప్రమాణాలకు సంబంధించిన అంశమా అన్నది లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.స్టార్‌లింక్ అనేది ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ రూపొందించిన లో-ఎర్త్ ఆర్బిట్ ఉపగ్రహ నెట్‌వర్క్. సాంప్రదాయ ఫైబర్ లేదా సెల్ టవర్ల అవసరం లేకుండా, అంతరిక్షంలో ఉన్న వేలాది చిన్న ఉపగ్రహాల ద్వారా నేరుగా భూమిపై ఉన్న డిష్, రిసీవర్లకు హై-స్పీడ్ శాటిలైట్ ఇంటర్నెట్‌ను ఇది అందిస్తుంది. భౌగోళికంగా చేరుకోలేని కొండ ప్రాంతాలు, అడవులు , మారుమూల గ్రామాలకు ఇది ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తుంది. భారత్‌లో ప్రవేశించేందుకు స్టార్‌లింక్ గత ఐదేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, వ్యాపార నిబంధనలు , స్పెక్ట్రమ్ కేటాయింపు పద్ధతులపై దేశీయ టెలికాం కంపెనీలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌తో ప్రధాన విభేదాలు తలెత్తాయి.అసలు వివాదానికి ప్రధాన మూలం స్పెక్ట్రమ్ కేటాయింపు విధానం . అంతర్జాతీయ నిబంధనల ప్రకారం శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను వేలం వేయకుండా పరిపాలనా ప్రాతిపదికన కేటాయించాలని మస్క్ వాదిస్తుండగా, దేశీయ స్పెక్ట్రమ్‌ను వేలం ద్వారా మాత్రమే కేటాయించాలని, అప్పుడే లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఉంటుందని అంబానీ నేతృత్వంలోని జియో పట్టుబట్టింది. దీనికితోడు జాతీయ భద్రత, డేటా లోకలైజేషన్ అంశాలు ప్రధాన అవరోధాలుగా మారాయి. భారతీయుల డేటా దేశీయ సర్వర్లలోనే భద్రంగా ఉండాలని, భద్రతా ఏజెన్సీలు నిఘా పెట్టేలా శాటిలైట్ గేట్‌వేలను ఏర్పాటు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. మస్క్ ఆరోపణలను కేంద్ర నివేదికలు తీవ్రంగా ఖండించాయి. టెలికాం నియంత్రణలన్నీ పారదర్శకంగా, వివక్ష రహితంగా ఉన్నాయని, స్టార్‌లింక్‌తో పాటు ఇతర మూడు సంస్థలు కూడా ఒకే భద్రతా తనిఖీల దశలో ఉన్నాయని కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.ఈ వ్యాపార పోరు కాస్త రాజకీయ రంగు పులుముకుంది. మస్క్ వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. వెల్‌కమ్ టూ ఇండియా ఎలాన్.. అసలు వ్యక్తి ఎవరో తెలిసే వరకు వేచి చూడండి అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దీనికి మస్క్ థాంక్యూ రాహుల్, ఇది నిజంగా ఆందోళనకరం అని బదులిచ్చారు. ఇక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ వివాదంపై స్పందిస్తూ, వినూత్న శాటిలైట్ ఇంటర్నెట్ సాంకేతికతను భారత్ ఆహ్వానించాలని, కొందరి పారిశ్రామిక ప్రయోజనాల కోసం అంతర్జాతీయంగా బ్రాండ్ ఇండియా ను బలహీనపరచకూడదని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు దీనిని కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ దిగ్గజాల బంధానికి నిదర్శనంగా విమర్శించగా, బిఆర్ఎస్, బిజెపి వర్గాలు భద్రతా నియంత్రణలను పక్కనబెట్టి విదేశీ సంస్థలకు కార్పెట్ పరిచే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. ఈ మొత్తం వివాదంపై ముఖేష్ అంబానీ, రిలయన్స్ జియో వర్గాలు ఇప్పటివరకు ప్రత్యక్షంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయితే, జియో కూడా స్వయంగా అంతరిక్ష ఉపగ్రహ ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను సొంతంగా అభివృద్ధి చేసేందుకు బిలియన్ డాలర్ల ప్రణాళికలతో సిద్ధమవుతోంది. కాబట్టి, విదేశీ దిగ్గజమైన స్టార్‌లింక్ భారత్‌లోకి ముందే అడుగుపెడితే దేశీయ టెలికాం పరిశ్రమకు, ముఖ్యంగా 5ఉ వ్యాపారానికి గట్టి పోటీ ఎదురవుతుందనేది బహిరంగ రహస్యమే.నిబంధనలు తీరి స్టార్‌లింక్ భారత మార్కెట్లోకి వస్తే మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ విప్లవం రావడం ఖాయం. అయితే డివైజ్ ధరలు, ప్లాన్ చార్జీలు సామాన్యుడికి అందుబాటులో ఉంటాయా లేదా అన్నది ప్రశ్నార్థకమే. ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలు కేవలం ఏకపక్ష వ్యాపార కోపంతో కూడుకున్నవా లేక విదేశీ పెట్టుబడులకు భారత నిబంధనలు కఠినంగా మారుతున్నాయా అనే దానిపై విస్తృత విశ్లేషణలు నడుస్తున్నాయి. జాతీయ భద్రత , డేటా రక్షణ విషయంలో రాజీ పడకుండానే, దేశీయ , అంతర్జాతీయ సంస్థలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా భారత టెలికాం రంగాన్ని ఆరోగ్యకరమైన పోటీ వైపు నడిపించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. టెక్ దిగ్గజం, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని టార్గెట్ చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "భారత ప్రధాన మంత్రి అంబానీ గారూ.." అంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్టులు దుమారం రేపుతున్నాయి. భారత్‌లో తన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అనుమతులు లభించడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. దేశీయ టెలికాం రంగాన్ని శాసిస్తున్న ముకేశ్ అంబానీ ప్రయోజనాల కోసమే తమకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇది ముమ్మాటికీ గుత్తాధిపత్యమేనని ఆరోపించారు. భారత్‌లో తన స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలకు అడ్డంకులు తొలగకపోవడంతో రిలయన్స్ అధినేతను, కేంద్రంలో అధికారంలో ఉన్న ఔఆం బీజేపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఎలాన్ మస్క్ సంచలన ఆరోపణలు చేశారు. శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపులు, భారత్‌లోకి స్టార్‌లింక్ ప్రవేశంపై రిలయన్స్ జియోతో వివాదం నడుస్తున్న సమయంలో ఎలాన్ మస్క్ పాత పోస్టులు షేర్ చేసి అటు కేంద్రంలోని బీజేపీని, ఇటు అంబానీని ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.తన ఆరోపణలకు బలం చేకూర్చేందుకు ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్', 'అల్ జజీరా' గతంలో రాసిన కథనాలను షేర్ చేశారు. ఎలక్టోరల్ బాండ్ల) ద్వారా రిలయన్స్ అనుబంధ సంస్థగా ప్రచారంలో ఉన్న 'క్విక్ సప్లై' కంపెనీ, అధికార బీజేపీకి రూ. 385 కోట్లు, శివసేన పార్టీకి రూ. 25 కోట్లు విరాళంగా ఇచ్చిందని ఆ కథనాల్లో కనిపిస్తుంది. బీజేపీకి అందిస్తున్న విరాళాల ద్వారానే రిలయన్స్ అధినేత అంబానీ మద్దతు పొందుతున్నారని మస్క్ ఆరోపించారు. అయితే, క్విక్ సప్లై కంపెనీ ఇండిపెండెంట్ సంస్థ అని, దాంతో తమకు ఎలాంటి సంబంధం లేదని రిలయన్స్ ఇదివరకే క్లారిటీ ఇచ్చింది. మస్క్ చేసిన తాజా వ్యాఖ్యలపై రిలయన్స్ నేరుగా స్పందించలేదు. వెనిజులాలో స్టార్ లింక్ సేవలు ప్రారంభమవుతున్నాయని, అందుకు కావాల్సిన అన్ని పర్మిషన్లు వచ్చాయని మస్క్ మరో పోస్ట్ చేశారు.ఎలాన్ మస్క్ ఆరోపణలను భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. భారత్ ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదని, అన్ని సంస్థలకు ఒకే విధమైన రూల్స్ ఉంటాయని తెలిపింది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో పాటు జియో శాటిలైట్, భారతీ ఎయిర్‌టెల్ మద్దతున్న వన్ వెబ్ కంపెనీలకు కూడా ప్రాథమిక లైసెన్సులు ఇచ్చామని కేంద్రం పేర్కొంది. అయితే వాణిజ్య సేవలు, స్పెక్ట్రమ్ కేటాయింపులకు ముందు భద్రతాపరమైన తనిఖీలు తప్పనిసరి అని, ఏ సంస్థలకు కేంద్రం వత్తాసు పలకాల్సిన అవసరం లేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. అన్ని కంపెనీలకు ఒకే విధమైన భద్రతా నియమాలు వర్తిస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. భారత్‌లో స్టార్ లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ తేవాలని మస్క్ ప్రయత్నిస్తున్న క్రమంలో దేశంలోని వ్యాపార నిబంధనలు, స్పెక్ట్రమ్ కేటాయింపు పద్ధతులపై రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌తో ఆ విదేశీ కంపెనీ మధ్య విభేదాలు తలెత్తాయి.

సౌదీపై హౌతీ దాడులు



పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ యుద్ధ జ్వాలలు చల్లారకముందే సౌదీ అరేబియాహౌతీల మధ్య ఘర్షణ మళ్లీ తీవ్రరూపం దాల్చడం అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది. యెమెన్‌లో దశాబ్దకాలంగా కొనసాగుతున్న అంతర్యుద్ధం, ప్రాంతీయ ఆధిపత్య పోరు, ఇరాన్‌సౌదీ పోటాపోటీ వైఖరి ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. కాల్పుల విరమణలు, దౌత్య చర్చలు, మధ్యవర్తిత్వ ప్రయత్నాలతో కొంతకాలం కనిపించిన ప్రశాంతత శాశ్వత శాంతికి దారితీయకపోవడం ఈ ప్రాంతంలోని అస్థిరతకు అద్దం పడుతున్నది. ఒకవైపు ఇజ్రాయెల్‌పాలస్తీనా సంక్షోభం, మరోవైపు ఎర్ర సముద్రంలో నౌకలపై దాడుల ముప్పు, ఇంకోవైపు గల్ఫ్ ప్రాంతంలో వ్యూహాత్మక ఆధిపత్యం కోసం పోటీ.. ఈ పరిణామాల మధ్య సౌదీహౌతీ ఉద్రిక్తతలు పెరగడం ఏమాత్రం వాంఛనీయం కాదు. ప్రపంచ వాణిజ్యం, చమురు సరఫరా, ఆహార భద్రత, అంతర్జాతీయ దౌత్యసంబంధాల మీదా ఈ ఘర్షణ తీవ్ర ప్రభావం చూపే ప్రమాదమున్నది.ల 2022లో యెమెన్ ప్రభుత్వం, తిరుగుబాటుదారుల మధ్య కుదిరిన సంధితో సౌదీ అరేబియా, హౌతీల మధ్య ప్రత్యక్ష ఘర్షణలు కొంతకాలం తగ్గుముఖం పట్టినప్పటికీ, యెమెన్ అంతర్యుద్ధానికి శాశ్వత పరిష్కారం మాత్రం లభించలేదు. ఈ ఏడాది జూలైలోనే క్షిపణి దాడులు మళ్లీ మొదలయ్యాయి. అక్టోబర్‌లో పరిస్థితి మరింత విషమించింది. సౌదీ రాజధాని రియాద్ విమానాశ్రయంపై దాడులు, చమురు, మౌలిక సదుపాయాలపై క్షిపణుల ప్రయోగం, సౌదీ ప్రతిదాడులతో ఉద్రిక్తతలు ప్రమాదకర స్థాయికి చేరాయి. ఈ నెల 13న ధహ్రాన్‌లోని సౌదీ అరామ్‌కో ప్రధాన కార్యాలయంపై హౌతీలు దాడి చేశారు. సౌదీ విమానాశ్రయాలు, చమురు కేంద్రాలపై మరిన్ని దాడులు చేస్తామని హౌతీలు హెచ్చరించడం గమనార్హం. ఈ ఘర్షణల వెనుక ప్రాంతీయ శక్తుల ప్రయోజనాలు, ఇరాన్‌సౌదీ విభేదాలు, అమెరికా పాత్ర, ఎర్ర సముద్రంపై నియంత్రణ వంటి అనేక అంశాలు ఉన్నాయి. హౌతీలకు ఇరాన్ మద్దతు ఉండగా, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వానికి సౌదీ అరేబియా అండగా నిలబడుతున్నది. ప్రపంచ ఇంధన మార్కెట్లలో అగ్రస్థానంలో నిలిచే సౌదీ అరేబియా చమురు క్షేత్రాలు, శుద్ధి కేంద్రాలు, ఎగుమతి టెర్మినళ్లు, విమానాశ్రయాలపై దాడులు కొనసాగితే ఉత్పత్తి, రవాణా, సరఫరా వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పెరిగి, ఆర్థిక రంగంపై ఒత్తిడి తేవడం కనిపిస్తున్నది. ఇక్కడ మరో కీలక భౌగోళిక అంశం బాబ్ ఎల్ మండెబ్ జలసంధిలో హౌతీలు జరుపుతున్న దాడులు. సౌదీ అరేబియా సహా గల్ఫ్ దేశాల నుంచి చమురు, ఇతర సరుకుల రవాణాలో జలసంధికి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్నది. ఈ మార్గంలో నౌకలపై దాడులు పెరుగుతుండటంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషించాల్సి వస్తున్నది. దీనివల్ల పెరిగే అదనపు భారం అంతిమంగా వినియోగదారులపైనే పడుతుంది. భారీ ఇంధన దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశానికి ఇది చిన్న సమస్య కాదు. ఈ ఘర్షణల నిలిపివేతకు, యెమెన్‌లో శాశ్వత శాంతికి ప్రపంచ దేశాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఐక్యరాజ్యసమితితో పాటు, ఒమన్ వంటి దేశాలు మధ్యవర్తిత్వానికి చురుకైన పాత్ర పోషించాలి. ప్రపంచం మరో విస్తృత యుద్ధాన్ని భరించే స్థితిలో లేదు.

జూరాల నీళ్లడిగితే రైతులకు సంకెళ్లా?



పండించేది వారి ఒక్కరి కడుపు నింపుకోవడానికి కాదు. సమాజంలోని అందరి ఆకలి చల్లార్చేది అన్నదాతలే. పంటలను కాపాడేందుకు వారు స్వయంగా నీళ్లు విడుదల చేసుకున్నది కూడా అందుకే. ఆ రైతులు నీళ్లు విడుదల చేసే సాహసం చేయకపోయి ఉంటే మంత్రులు హడావుడిగా సెప్టెంబర్ 24న బెంగుళూరు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రిని కలిసి జూరాలకు నీళ్లు వదలాలని కోరేవారే కాదు. ఇది ఆ రైతులు కేసులు మోస్తూ సాధించిన విజయం కాదా? నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి విడతలవారీగా 3 టీఎంసీల నీళ్లు అందిస్తామన్న కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మాట చెల్లుబాటు కాలేదు. సెప్టెంబర్ చివరి వారంలో కర్ణాటకలో పడిన వర్షాల ద్వారా వచ్చిన నీరు మాత్రమే జూరాల చేరింది. ఆ తర్వాత ఆగిపోయింది. నారాయణపూర్, ఆల్మట్టి డ్యామ్‌లలో సమృద్ధిగా నీళ్లున్నాయి, వారబందీ లెక్కన పది రోజుల పాటు మనకు నీళ్లందుతాయి. రెండు రోజుల్లో జూరాలకు చేరుతాయి అని ప్రకటించిన అధికారుల మాట తేలిపోయింది. ఏది ఏమైనా తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నం ఫలించలేదు. జూరాల ఆయకట్టు కింది చివరి పొలాలు ఎండిపోతున్నాయి. నీళ్లు ఇస్తామని మాట తప్పిన కర్ణాటకలో ఉన్నదీ కాంగ్రెస్ ప్రభుత్వమే. మరి సమన్వయం చేసుకుంటూ రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత తెలంగాణ పాలకులకు లేదా? రైతులను బలి చేయడం న్యాయమా?

కరువుపై సర్కార్ చోద్యం

ఆ క్రమంలో తోపులాట, గొడవ జరిగింది. అయితే ఆ అన్నదాతలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించారని ఇరిగేషన్ అధికారులు అమరచింత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మరునాడే 14 మంది రైతులపై నాన్ బెయిలెబుల్ కేసులు నమోదు అయ్యాయి. ఇప్పుడు వారి ఇండ్లపై పోలీసుల నిఘా ఉన్నది. ఏ క్షణాన అయినా వారిని అరెస్టు చేసి జైలుపాలు చేయొచ్చు. వారిపై భారత న్యాయ సంహితలోని పదికి పైగా సెక్షన్లను మోపారు. జూరాల నీటి విడుదల సందర్భంగా రైతులెవరూ ఆఫీసులోకి చొరబడి అధికారుల విధులకు ఆటంకం కలిగించలేదు. ఎవరిపైనా భౌతిక దాడులకు పాల్పడలేదు. అంతకుముందే ఎండిపోతున్న పంటలకు నీరు ఇవ్వండి అంటూ ఇరిగేషన్ ఆఫీసుల చుట్టూ రోజుల తరబడి తిరిగారు. ఎన్ని రోజులైనా అధికారులు పంటల వైపు రాలేదు. ఫోన్లు చేసినా బదులు ఇవ్వలేదు. ఏ దారీలేని రైతులు చివరకు ప్రాజెక్టు వద్ద నిరసనలు చేపట్టారు. వారిని శాంతింపజేసే ప్రయత్నాలు ప్రభుత్వం వైపు నుంచి జరుగలేదు. నీరు విడుదల చేసే ప్రసక్తే లేదని మంత్రులు ప్రకటించారు. పది రోజుల ఆందోళన తర్వాత కూడా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో కడుపుమండిన రైతులు స్వయంగా నీళ్లు విడుదల చేసుకున్నారు. ఇందులో రైతుల పరిస్థితిని అర్థం చేసుకోని, వారి ఆవేదనను పట్టించుకోని ప్రభుత్వానిదే నేరం. ఇది కేవలం కేసుల పాలైన 14 మంది రైతుల ఆగ్రహం మాత్రమే కాదు, బాధిత రైతులు లక్షల్లో ఉన్నారు. వర్షాలు లేని కారణంగా అందరి కన్నా ఎక్కువగా నష్టపోయేది రైతులే. వారి దుస్థితిని సానుభూతితో అర్థం చేసుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిది. పంటల నష్టం, ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేని రైతులు మరిన్ని రూపాల్లో కూడా తమ ఆందోళనలను ప్రకటించవచ్చు. అందరిపై కేసులు పెడుతూ పోతే ప్రజాగ్రహం పెల్లుబుకుతుంది. రైతులు

ఎల్ నినో అంటే కేవలం వాతావరణ పరిణామం కాదు, అది వ్యవసాయం, నీటి భద్రత, ఆహార భద్రత, ప్రజల జీవనంపై ప్రభావం చూపే సవాల్. కానీ ప్రభుత్వం ఎల్ నినో హెచ్చరికకలను లెక్క చేయకుండా సంక్షోభం వచ్చే వరకు కాలయాపన చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయంలో విలువైన సమయం వృథా చేసింది. సాగు, తాగునీటి భద్రతపై చర్యలు చేపట్టలేదు. వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో గతంలో నమోదైన అత్యధిక స్థాయిని మించే అవకాశం ఉన్నది. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. లేకపోతే సాగు ఆగమై, ప్రజల జీవనం దుర్భరంగా మారుతుంది. కరువు ఒక రంగానికి సంబంధించిన సమస్య కాదు. సాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు, తాగునీరు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అన్నింటినీ ప్రభావితం చేసే గొలుసు ప్రభావం. ఈ ప్రమాదం రానున్నదని రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తెలుసు. కరువును ఎదుర్కొనేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అసలు ప్రశ్న ప్రభుత్వం హెచ్చరికను గుర్తించిందా లేదా అనేదే ముఖ్యం కాదు, ఆ హెచ్చరికకు తగిన వేగంతో చర్యలు తీసుకుంటున్నదా అనే ముఖ్యం. తెలంగాణకు ఆధారమైన అతిపెద్ద సహజ వనరు గోదావరి. ముఖ్యంగా ప్రాణహితగోదావరి సంగమం తర్వాత కన్నేపల్లి ప్రాంతంలో అందుబాటులోకి వచ్చే నీటిని సురక్షితంగా వినియోగించుకునే అవకాశాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలి. కానీ ఈ విషయంలో ప్రభుత్వం విలువైన సమయాన్ని కోల్పోయింది. గోదావరిలో లభిస్తున్న నీటిని సాధ్యమైన మేరకు వినియోగించుకోవాలని, కన్నేపల్లి పంప్ హౌస్‌తోపాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వ్యవస్థలో సురక్షితంగా ఉపయోగించగల భాగాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని వానకాలం ప్రారంభంలోనే రిటైర్డ్ ఇంజినీర్లు, నీటిపారుదల నిపుణులు సూచించారు. కానీ ప్రభుత్వం పెడచెవినపెట్టింది. మరోవైపు కండ్లముందుగా ప్రవహిస్తున్న గోదావరి నీటిని సురక్షితంగా వినియోగించుకునే అవకాశాలను కోల్పోవడం పరిపాలనా దూరదృష్టి లోపంగానే కనిపిస్తున్నది. ఎల్ నినో ప్రభావం తీవ్రమైతే ప్రభుత్వం పంటలు, జిల్లాల వారీగా నీటి భద్రతా ప్రణాళిక రూపొందించాలి. ఇప్పటికే సాగులో ఉన్న పంటలను ముందుగా రక్షించాలి. ఏ ప్రాజెక్టులో ఎంత నీరున్నది? ఆ ప్రాజెక్టుల కింద ఎంత ఆయకట్టు ఉన్నది? ఎంత నీరు అవసరం ఉన్నది? అనే వివరాలను ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలి. అంతేకాకుండా చెరువుల పునరుద్ధరణ, భూగర్భజలాల సంరక్షణ వంటి చర్యలను చేపట్టాలి. రైతులకు కేవలం సలహాలు ఇవ్వడం సరిపోదు. నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళికను రూపొందించి, ఆ ప్రణాళికను అమలు చేయడానికి ప్రభుత్వం ఆర్థిక, సాంకేతిక సాయం అందించాలి. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గితే గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల మీదా ఒత్తిడి పెరుగుతుంది. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరానికి వేసవిలో తాగునీటి అవసరం మరింత పెరుగుతుంది. అందువల్ల ప్రభుత్వం తాగునీటి భద్రతా ప్రణాళిక రూపొందించాలి. ప్రతి ప్రధాన రిజర్వాయర్లో ప్రస్తుతం ఎంత నీరు ఉన్నది? సాధారణ వినియోగంతో అది ఎన్ని నెలలకు సరిపోతుంది? ప్రత్యామ్నాయ వనరులు ఏమిటి? అత్యవసర పరిస్థితిలో ఏ వనరుల నుంచి నీటిని తీసుకురావచ్చు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. హైదరాబాద్‌తోపాటు అన్ని మున్సిపాలిటీలకు ప్రధాన నీటి వనరు, ప్రత్యామ్నాయ వనరు, అత్యవసర వనరు అనే మూడు స్థాయిల నీటి భద్రతా వ్యవస్థ ఉండాలి. వర్షాభావ పరిస్థితుల్లో విద్యుత్తు రంగం మీదా ప్రభావం పడుతుంది. నీటి కొరత వల్ల జల విద్యుత్తు ఉత్పత్తి తగ్గుతుంది. అదే సమయంలో వేసవి వేడి పెరిగితే గృహాలు, వ్యవసాయం, పరిశ్రమల నుంచి విద్యుత్తు డిమాండ్ పెరుగుతుంది. కాబట్టి విద్యుత్తు కొనుగోలు, థర్మల్ విద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన ఇంధన నిల్వలు, వ్యవసాయానికి నిరంతర సరఫరా వంటి అంశాలపై ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే లేదా ఏర్పాటు చేసిన వార్ రూమ్ కేవలం అధికారుల సమావేశాలకు పరిమితం కాకూడదు. ప్రతి వారం ప్రజలకు ఒక స్పష్టమైన పరిస్థితి నివేదిక ఇవ్వాలి: జిల్లాల వారీగా వర్షపాతం, ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు, గోదావరి, కృష్ణా నదుల ప్రవాహాలు, తాగునీటి లభ్యత, సాగునీటి విడుదల, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భజల పరిస్థితి, విద్యుత్తు డిమాండ్, సరఫరా వంటి అంశాలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి. రానున్న వారాల్లో వాతావరణ అంచనాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఎల్ నినో అనేది ప్రకృతి పరిణామం. దాని ప్రభావాన్ని ఎంతవరకు తగ్గించగలమో అని అలోచించాల్సింది మాత్రం ప్రభుత్వమే. ప్రజలపై కరువు ప్రభావం ఏ మేరకు పడుతుంది అనేది పాలక పెద్దలు తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుం ది. అందుకే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు ఒక్కరోజు కూడా ఆలస్యం చేయకూడదు. పనులకు కచ్చితమైన గడువు నిర్ణయించి, పురోగతిని ప్రజలకు తెలియజేయాలి. నీటి భద్రతను వాయిదా వేయడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధం. కొన్ని నెలల్లో రాజకీయ వివాదాలు, పరస్పర ఆరోపణలు, అనవసరమైన అంశాలపై సమయం కేటాయించిన పాలకులు, నీటి సమస్య పరిష్కారం మీదా దృష్టి పెట్టాలి.

సౌదీలో దాడులు వెంటనే ఆపాలి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో సౌదీ అరేబియాలో పౌర మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలు, చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దాడులను భారతదేశం ఖండించింది. ఈ దాడులు తక్షణమే నిలిపివేయాలని, ఎంత మాత్రం పౌర మౌలిక సదుపాయాలపై దాడులు ఆమోదయోగ్యం కాదని ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) స్పష్టం చేసింది. సౌదీలోని భారత పౌరుల కోసం అక్కడి భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసింది. పౌరులు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, స్థానిక అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. ఇదే సమయంలో విదేశాల్లోని భారత పౌరుల సంక్షేమం, భద్రత తమ ప్రథమ ప్రాధాన్యం అని ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో జైస్వాల్- పలు కీలక అంశాలపై భారత వైఖరిని వెల్లడించారు.

సౌదీ అరేబియాలో జరుగుతున్న దాడుల పట్ల విచారం వ్యక్తం చేసిన భారత్- సౌదీ ప్రజలు, ప్రభుత్వానికి సంఘీభావం తెలుపుతోందని జైస్వాల్ పేర్కొన్నారు. ఆ దేశ సార్వభౌమత్వం, సమగ్రతను కాపాడుకునే ప్రయత్నాలకు భారత్ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో త్వరలోనే శాంతి చర్చలు జరిగి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై అక్టోబర్ 10న జరిగిన దాడిలో మొత్తం ఒక భారతీయుడు సహా మొత్తం 13 మంది మరణించగా, మరో 10 మంది భారతీయులు గాయపడ్డారు. మృతుడి కుటుంబ సభ్యుల మేరకు సౌదీలోనే అంత్యక్రియలు నిర్వహించారు. యెమెన్‌లోని ఇరాన్ మద్దతు ఉన్న హూతీ తిరుగుబాటుదారులు కొద్ది రోజులుగా సౌదీపై వరుస దాడులకు పాల్పడుతున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. గాయపడిన భారతీయుల్లో పలువురు ఆస్పత్రుల్లో చికిత్స



పొందుతున్నారు.

భారతీయులకు ఎంబసీ కీలక మార్గదర్శకాలు

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా దాడులు జరుగుతున్నందున అక్కడి భారతీయులకు, భారత రాయబార కార్యాలయం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. భారతీయులు అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, స్థానిక అధికారుల సూచనల్ని కచ్చితంగా పాటించాలని పేర్కొంది. జరుగుతున్న పరిణామాలకు సంబంధించి వీడియోలు, వార్తల్ని ధ్రువీకరించకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. భారతీయులకు సహాయం చేసేందుకు ఎంబసీ 24 గంటల కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో ం966- 536216082 (వాట్సాప్) నంబర్‌కు సందేశాలు పంపొచ్చు. ఇంకా 8002471234 నంబరు ద్వారా అధికారుల్ని సంప్రదించొచ్చు. మరోవైపు గల్ఫ్, హర్మూజ్ జలసంధి ప్రాంతాల్లో వాణిజ్య నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. ఈ క్రమంలో భారత జాతీయ భద్రతా సలహాదారు (వీూూ) అజిత్ డోభాల్ అక్టోబర్ 12న ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహ్‌సేన్ రెజాయితో ఫోన్‌లో మాట్లాడినట్లు రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. సముద్ర మార్గాల్లో భారత నావికులు, చమురు ట్యాంకర్ల భద్రతపై ఇరువురు చర్చించినట్లు తెలిపారు. ఇటీవల వారం వ్యవధిలోనే భారతీయ సిబ్బంది ఉన్న 3 వాణిజ్య నౌకలపై వరుస దాడి ఘటనలు సముద్ర భద్రతపై ఆందోళనలు పెంచాయి.

దిల్లీలో దీ×మీూజుజ హోం మంత్రుల భేటీ- బంగ్లాదేశ్ హాజరు

ఇక కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన న్యూదిల్లీలో తొలి బిమ్‌స్టెక్ (దీ×మీూజుజ) హోం మంత్రుల భేటీ జరిగినట్లు జైస్వాల్ తెలిపారు. ఇందులో బంగ్లాదేశ్‌తో సహా అన్ని సభ్యదేశాలు పాల్గొన్నాయని వెల్లడించారు. ఇందులో ఉగ్రవాద నిర్మూలన, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై చర్యలు, మనీలాండరింగ్ నియంత్రణలో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని పునరుద్ఘాటిస్తూ 'దిల్లీ డిక్లరేషన్'ను ఆమోదించారని ఎంఈఏ అధికార ప్రతినిధి వివరించారు. కొంతకాలంగా భారత్- బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, దిల్లీలో నిర్వహించిన ఈ సమావేశంలో బంగ్లాదేశ్ పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. దిల్లీ నిరసనలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం (ూఒజఒ=) చేసిన వ్యాఖ్యలను కూడా భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇది భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని, ఆ వ్యాఖ్యలు అనుచితమని తోసిపుచ్చింది. ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న అణచివేతలపై స్పందించని ఓహెచ్‌సీహెచ్‌ఆర్ వైఖరి ఏకపక్షంగా ఉందని భారత్ వైఖరిని వెల్లడించారు జైస్వాల్.

ధిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన



తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ధిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు 'లెట్రోవో దో తిరంగా' అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు. ధిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు.

ఐదు రోజుల జ్యూడీషియల్ కస్టడీ

మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

చైనాతో సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే

వాస్తవాధీన రేఖ స్థిరంగా ఉండాలి

భారత్- చైనా మధ్య సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే 'వాస్తవాధీన రేఖ' వెంబడి పరిస్థితి స్థిరంగా ఉండాలని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. సరిహద్దుల్లో ఎటువంటి అశాంతి చెలరేగినా దానికి పర్యవసానాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణ సరిహద్దు వద్ద శాంతితోనే ముడిపడి ఉన్నాయని అభిప్రాయపడ్డారు. దిల్లీలో జరిగిన 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్'లో ప్రసంగిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

"చైనాకు మేము చెప్పే విషయం ఒకటే 'మీరు ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలను కోరుకున్నా, మిగిలిన సంబంధాలు ముందుకు సాగాలన్నా సరిహద్దు స్థిరంగా ఉండాలి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి అనేది చాలా స్పష్టమైన, సహజమైన విషయం'" అని ఆయన అన్నారు. 2024 నుంచి ూూజ వెంబడి పరిస్థితి చాలా వరకు అదుపులోకి వచ్చిందని, ఫలితంగా సంబంధాలు సాధారణ స్థితి వైపు పయనిస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. తూర్పు లద్దాఖ్‌లో నాలుగన్నర ఏళ్లకు పైగా కొనసాగిన సైనిక ప్రతిష్టంభన కారణంగా దెబ్బతిన్న సంబంధాలను సరిదిద్దడానికి గత కొన్ని నెలలుగా ఇరుపక్షాలు చర్యలు చేపట్టాయి. చివరకు ఇరు దేశాల మధ్య పలు దఫాల చర్చల అనంతరం ప్రతిష్టంభన 2024 చివరలో ముగిసింది. ఈ క్రమంలోనే సరిహద్దు సమస్యపై ఏదైనా 'ప్రారంభ దశ ఒప్పందం' కుదిరితే దేశంలో మరిన్ని చైనా పెట్టుబడులను భారత్ అనుమతిస్తుందా అన్న ప్రశ్నకు సమాధానంగా, వివిధ



అవకాశాలను పరిశీలిస్తున్నామని జైశంకర్ స్థూలంగా చెప్పారు. "మేము ఇప్పుడు ఆ అవకాశాలను పరిశీలిస్తున్నాం. భవిష్యత్తులో పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి. అయితే, వ్యాపారం చేయడానికి ముందు సరిహద్దు సమస్యను తప్పనిసరిగా పరిష్కరించుకోవాలని మేము పట్టుబట్టడం లేదు. మేము పెద్ద నిబంధనలు లేదా కఠినమైన షరతులు పెట్టడం లేదు. మా అంచనాలు చాలా తక్కువగా ఉన్నాయి. కేవలం శాంతి, ప్రశాంతతను పాటించడం మాత్రమే కావాలి. సరిహద్దు సమస్య పరిష్కారం తప్ప మరేదానితోనూ ఈ 'ప్రారంభ దశ ఒప్పందాన్ని' నేను ముడిపెట్టను. వ్యాపారం లేదా మార్కెట్ యాక్సెస్ అంశాలకు సంబంధించి మేము అనుసరించే విధానాలు వేరుగా పరిగణిస్తాం."

చైనాతో ఉన్న ఆర్థికపరమైన అంశాలపై కూడా విదేశాంగ మంత్రి జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. "చైనాతో మాకు చాలా కీలకమైన ఆర్థిక సమస్యలు కూడా ఉన్నాయి. నేడు వాణిజ్య సమతుల్యతను పరిశీలిస్తే, అది పూర్తిగా చైనా వైపే మొగ్గు చూపి ఉంటోంది. ఈ అసమతుల్యత తీవ్రంగా ఒకే వైపునకే ఉంది. ప్రపంచంలోని ఇతర దేశాలతో అనేక రంగాల్లో మేము విజయవంతంగా వాణిజ్యం సాగిస్తున్నా, చైనాలో మాత్రం మాకు మార్కెట్ ప్రవేశం లభించలేదు. అక్కడ ఆయా రంగాల్లో మా వ్యాపార కార్యకలాపాలు విజయవంతం కాలేదు. మేము వారికి సమానమైన వాణిజ్య అవకాశాలను కల్పించినట్లుగా, చైనాలో మాకు అటువంటి సమాన అవకాశాలు లభించడం లేదని మేము భావిస్తున్నాం." అని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే 2020 నాటి గల్వాన్ లోయ ఘర్షణల గురించి కూడా జైశంకర్ ప్రస్తావించారు. అవి ఇరు దేశాల సంబంధాలపై ఎంత తీవ్రమైన ఒత్తిడిని కలిగించాయో గుర్తు చేశారు. "1975 నుంచి 2020 వరకు అంటే దాదాపు 45 ఏళ్ల పాటు సరిహద్దులో ఎటువంటి రక్తపాతం జరగలేదు. చివరిసారిగా 1975లో ప్రాణనష్టం జరిగింది. ఆ తర్వాత కాలంలో భారత్- చైనా సంబంధాలు మెరుగుపడ్డాయి. అనంతరం 2020లో మేము కొవిడ్ లాక్‌డౌన్ పరిస్థితుల్లో ఉన్నప్పుడు సరిహద్దులో వరుస సమస్యలు తలెత్తాయి. చివరకు అవి ఘర్షణకు దారితీసి ఇరువైపులా పలువురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మా దృష్టిలో ఇది 1975 నుంచి కొనసాగుతున్న పరిస్థితులకు పూర్తిగా భిన్నమైన పరిణామం. సరిహద్దు ప్రాంతాల్లో శాంతికి భంగం కలిగితే అది సంబంధాలపై ప్రభావం చూపుతుంది," అని జైశంకర్? అన్నారు. శాంతిని పునరుద్ధరించే వరకు తర్వాతి కొన్నేళ్లలో ఆ పరిణామాలు స్పష్టంగా కనిపించాయని జైశంకర్ పేర్కొన్నారు.

దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోంది



భారతదేశ సంగీతం, నృత్యం, సినిమాలు, వంటకాలు దేశాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాజాలతో అనుసంధానిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వీటి వల్ల దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోందని కొనియాడారు. చారిత్రక కట్టడాలను పరిరక్షించడంతో పాటు 'జ్ఞాన్ భారతం' కార్యక్రమం ద్వారా భారత పురాతన తాళపత్రాల వారసత్వాన్ని కూడా ప్రభుత్వం పరిరక్షిస్తోందని ఆయన తెలిపారు. అక్టోబర్ 14 నుంచి 16 వరకు దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న 'బృహత్తర భారత్: ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు'ను ఉద్దేశించి పంపిన సందేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ ప్రధాన మంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా పాల్గొన్నారు. విదేశాల నుంచి పురాతన కళాఖండాలను తిరిగి భారత్?కు తీసుకువచ్చే ప్రయత్నాలు కొత్త ఊపును అందుకున్నాయని తెలిపారు. అదే సమయంలో భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పెరుగుతోందని మోదీ చెప్పారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వం, సరిహద్దులకు అతీతంగా విస్తరించిన దాని నాగరికతా వారసత్వం అనే ఇతివృత్తంతో జరుగుతోంది. ఈ సదస్సును కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని 'ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్' (×+చీజూూ) నిర్వహిస్తోంది. ప్రపంచంతో భారతదేశానికి ఉన్న చారిత్రక, సమకాలీన సాంస్కృతిక సంబంధాలపై చర్చించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. దీనికి వివిధ దేశాల ప్రతినిధులు, రాయబారులు, పండితులు హాజరవుతున్నారు. అలాగే, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంలో అప్పటి కలకత్తాలో 1926 అక్టోబర్ 14న భారతీయ పండితుల బృందం స్థాపించిన 'గ్రేటర్ ఇండియా సొసైటీ' (బృహత్తర భారత్ పరిషత్) శతజయంతి ఉత్సవాలకు కూడా ఇది వేదికైందని ×+చీజూూ పేర్కొంది.

జంతర్‌మంతర్ భారత ప్రజలది

దిల్లీలోని జంతర్?మంతర్ వద్ద నిరసన తెలిపిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలను జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. జాతీయ జెండాను ప్రదర్శించినందుకు యువతను జైలుకు పంపడమేంటని ప్రశ్నించాయి. నిరసన తెలిపే హక్కును హరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విపక్ష నేతలు విమర్శించారు. జంతర్‌మంతర్ దేశ ప్రజలదని, దాన్ని తిరిగి సాధించుకుంటామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిని జైల్లో పెడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించడం నేరం కాదని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇలా చేసినందుకు యువతను జైలుకు పంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి వేర్వేరు వేదికలపై ఉన్నప్పటికీ అందరి లక్ష్యం ఒక్కటే. రాజ్యాంగం కల్పించిన హక్కులను కోరుతూ పౌరులు చేస్తున్న ఆందోళనలన్నీ ఒకే పోరాటంలో భాగం. జంతర్‌మంతర్ భారత ప్రజలకు చెందినది. దాన్ని తిరిగి సాధించుకుంటాం. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉంది' అని రాహుల్ గాంధీ తెలిపారు.

ముందు ఓటు తర్వాత నిరసన హక్కు చోరీ : ఖర్గే

"ఎస్ఐఆర్ ప్రక్రియకు వెలుపల ఉన్న 13.3 కోట్ల మందిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'చొరబాటుదారులుగా అభివర్ణించడం వారి జాతీయతను అవమానించడమే. సుప్రీంకోర్టు నిర్ణయం ఉన్నప్పటికీ జంతర్‌మంతర్‌ను నిరసనలకు అనుమతించిన ప్రదేశాల జాబితా నుంచి తొలగించడం అంటే మొదట ఓటు చోరీ ఇప్పుడు నిరసన తెలిపే హక్కు చోరీనే అవుతుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు రక్షణ కల్పించడం ఆపాలి. యువ నిరసనకారులను జైలుకు పంపడం, ఆందోళనకారులపై పోలీసులు బలప్రయోగం చేయడం, మహిళల పట్ల దురుసుగా వ్యవహరించారు. ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఉన్నట్లు తాను పేర్కొన్న కొన్ని వర్గాలకు అధికారులు స్వేచ్ఛనిస్తున్నారు. మోదీ-షా ప్రభుత్వ విధానాలకు ప్రజలు తలవంచబోరని, బీజేపీని ప్రతి అంశంపై నిలదీస్తారు. దేశ ప్రజలు తమ గొంతు వినిపిస్తూనే ఉంటారు"

'మన దేశంలో మన జెండా ఎగరేయడం నేరమా?'

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా సీజేపీ కార్యకర్తలపై చర్యలను తప్పుబట్టారు. సొంత దేశంలో జాతీయ జెండాను ప్రదర్శించడం నేరమా అని ప్రశ్నించారు. పోలీసుల చర్య పూర్తిగా హాస్యాస్పదంగా ఉందని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే కూడా సీజేపీ కార్యకర్తల అరెస్టును ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. జంతర్ మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించిన యువతను జైలుకు పంపడమేంటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి సాధించుకునే వరకు ప్రభుత్వానికి, దేశభక్తులైన యువతకు మధ్య పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

అరెస్టయిన యువతకు అండగా డీఎంకే

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సైతం ఈ ఘటనపై స్పందించారు. ఎంతమంది నిరసనకారులను ప్రభుత్వం నిర్బంధించగలదని, ఎంతమంది యువత గొంతులను అణచివేయగలదని ప్రశ్నించారు. యువతను జైలుకు పంపే కొద్దీ రాజకీయాలతో సంబంధం లేని సాధారణ పౌరులు సైతం వీధుల్లోకి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేస్తారని అన్నారు. సౌరవ్ దాస్, ఆశుతోష్‌కు అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు డీఎంకే సిద్ధంగా ఉందని తెలిపారు. నిరసనకారులపై చర్యలు ప్రజల్లో మరింత వ్యతిరేకతను పెంచుతాయని హెచ్చరించారు.

ఇదిలా ఉండగా, ఆందోళనల సమయంలో పలువురు నిరసనకారులను పోలీసులు కొట్టారని మీడియా సమావేశంలో రాహుల్ ఆరోపించారు. ప్రజల ముక్తకంఠాన్ని అణచివేయాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కేంద్ర ప్రభుత్వాన్నిహెచ్చరించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వీరికి కులం, మతం, లింగ భేదాలు లేవని చెప్పారు. ముక్త కంఠంతో పోరాడుతున్న వారిపై దాడులు సహించబోమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా ఈ ప్రజా గళానికి వ్యతిరేకంగా నిలబడుతున్నారని, ఆ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని సూచించారు. దౌర్జన్యాలకు పాల్పడుతున్న పోలీసుల వీడియోలు తీసి, ఆ ఆధారాలను తమకు పంపాలని విద్యార్థులకు సూచించినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారం ముగిసిన తర్వాత ఆ సాక్ష్యాధారాలతో విద్యార్థులపై చేయి చేసుకున్న వారికి శిక్ష పడేలా చేస్తామన్నారు.

పోలీస్ స్టేషన్‌లోనూ కొట్టారని ఆరోపణ

తనపై ఓ మహిళా కానిస్టేబుల్ దాడి చేశారని ఎన్ఎస్‌యూఐ మహిళా కార్యకర్త తెలిపారు. నిరసనలో పాల్గొన్న కార్యకర్తలను పోలీసులు మూడు బస్సుల్లో ఎక్కించి అదుపులోకి తీసుకున్నారని చెప్పారు.

షార్జాలో భారతీయుడికి జాక్‌పాట్..

లాటరీలో రూ. 13 కోట్లు!



యూఏఈలోని షార్జాలో నివసిస్తున్న కిషోర్ అనే ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. ఆయన ఏకంగా 5 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 13 కోట్లు) లాటరీ గెలుచుకున్నారు. యూఏఈ లాటరీలో రెండో బహుమతిని ఆయన సొంతం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 3న యూఏఈ లాటరీ నిర్వాహకులు డ్రా తీశారు. ఈ డ్రాలో కిషోర్ కొనుగోలు చేసిన టికెట్‌కు రెండో బహుమతి దక్కింది. ఆయన అధికారిక వెబ్‌సైట్ ద్వారా 50 దిర్హమ్‌లు (సుమారు రూ. 1300) వెచ్చించి ఈ టికెట్‌ను కొనుగోలు చేశారు. లాటరీ ఫలితాలు వెలువడిన తర్వాత, విజేతల జాబితాలో తన పేరు చూసి మొదట నమ్మలేకపోయానని కిషోర్ తెలిపారు. ఆ తర్వాత తన వద్ద ఉన్న టికెట్ నంబర్‌తో సరిచూసుకుని, విజేతను తానేనని నిర్ధారించుకున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ లాటరీ డ్రాలో 30 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 78 కోట్లు) భారీ జాక్‌పాట్‌ను ఎవరూ గెలుచుకోలేదని నిర్వాహకులు తెలిపారు. కిషోర్ లాటరీ గెలిచిన విషయాన్ని యూఏఈ లాటరీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఒక్క లాటరీ టికెట్‌తో రాత్రికి రాత్రే కోటీశ్వరుడైన కిషోర్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

విస్తృతంగా గ్రామీణ రహదారుల అభివృద్ధి - ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఘంటసాల, మహానగర్



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో విస్తృతంగా గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బుధవారం ఘంటసాల మండలం మల్లంపల్లిలో రూ.56.50 లక్షలతో ఎస్సీ కాలనీకి 900 మీటర్లు తారురోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. వి.రుద్రవరంలో రూ.18.25 లక్షలతో 300 మీటర్లు తారు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తన పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా పల్లెల ప్రగతికి విశేష ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో పల్లె పండుగ-1.0 ద్వారా నియోజకవర్గంలో 45 కిలోమీటర్ల సీసీ రోడ్లు, పల్లె పండుగ-2.0 నిధులు, సాస్కి నిధులతో తారు రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. పల్లెపండుగ 3.0 ద్వారా వీబీజీ రాంజీ నిధులు రూ.17,18,35,000లతో నియోజకవర్గంలో 32 కిలోమీటర్ల మేర 32 తారు రోడ్లు, సీసీ రోడ్లు, మెటల్ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో నియోజకవర్గంలో దాదాపు రూ.75కోట్లతో గ్రామీణ రహదారుల అభివృద్ధి సాకారం అవుతోందన్నారు. పవన్ కళ్యాణ్ లక్ష్య సాధనకు సహకరిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబులకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, సీనియర్ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, డీసీ చైర్మన్ అయినంపూడి భానుప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ బండి పరాత్పరరావు, డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతిరావు, ఘంటసాల గ్రామ పార్టీ అధ్యక్షులు యార్ల శ్రీకాంత్, మాజీ సర్పంచ్ బెల్లంకొండ అమలేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ నారగం లక్ష్మణరావు, నీటి సంఘం ఉపాధ్యక్షులు అయినంపూడి ప్రవీణ్, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు తలశిల ప్రభాకరరావు, తహసీల్దార్ వీ.విజయప్రసాద్, పంచాయతీరాజ్ డీఈఈ పగడాల సురేష్ బాబు, ఏఈ బ్రహ్మానందబాబు, పంచాయతీ కార్యదర్శి యక్కటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర-కర్ణాటక రంజీ మ్యాచ్ డ్రా

కరుణ్ నాయర్ పోరాటంతో కర్ణాటకకు ఊరట.. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎస్.వి. రాహుల్





విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

మూలపాడు వేదికగా ఆంధ్ర, కర్ణాటక జట్ల మధ్య జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. నాలుగో రోజు ఆటలో కర్ణాటక జట్టు రెండో ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసి ఆంధ్ర జట్టు విజయావకాశాలను దెబ్బతీసింది. కర్ణాటక బ్యాటర్ కరుణ్ నాయర్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకుని మెరుగైన స్కోరు సాధించడంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఆంధ్ర బౌలర్లలో ఎల్. మోహన్ ఐదు వికెట్లు పడగొట్టగా, ఎస్. కుమార్ మూడు, టీ. విజయ్ ఒక వికెట్ సాధించారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. ఆంధ్ర బ్యాటర్ ఎస్.వి. రాహుల్ 85 బంతులు ఎదుర్కొని ఐదు ఫోర్లతో 35 పరుగులు చేసి రెండో ఇన్నింగ్స్‌లోనూ రాణించాడు. కర్ణాటక బౌలర్లలో శిఖర్ శెట్టి రెండు వికెట్లు తీయగా, బత్కల్, బజాజ్ చెరో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న ఎస్.వి. రాహుల్ ఈ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. మరోవైపు భారత స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు నాలుగు రోజుల పాటు అభిమానులు పెద్ద సంఖ్యలో మూలపాడు స్టేడియానికి తరలివచ్చారు. అయితే ఆయన బ్యాటింగ్‌లోనూ మెరిసి ఉంటే మరింత ఆనందంగా ఉండేదని అభిమానులు అభిప్రాయపడ్డారు. ఈ మ్యాచ్‌తో ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ సందడి నెలకొనగా, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్ బాబు మరిన్ని ప్రతిష్ఠాత్మక క్రికెట్ మ్యాచ్‌లను రాష్ట్రానికి తీసుకురావాలని అభిమానులు కోరుతున్నారు. ఇటువంటి మ్యాచ్‌లు రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి, స్థానిక క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఓ వైపు విద్యుత్ కొరత.. మరో వైపు అదనపు బిల్లుల భారం

హైదరాబాద్

తెలంగాణలో విద్యుత్ సంక్షోభం, మరోవైపు ట్రూ-అప్ చార్జీల భారం రాష్ట్ర ప్రభుత్వానికి కొత్త సవాళ్లను విసురుతున్నాయి. మండుతున్న ఎండలు, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగంలో పెరిగిన విద్యుత్ అవసరాలు సరఫరా వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరగా, అక్కడక్కడా అప్రకటిత విద్యుత్ కోతలు, లో-వోల్టేజీ సమస్యలపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. రూ.5,420.23 కోట్ల ట్రూ-అప్ చార్జీలను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా సవాలుగా మారింది.2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విద్యుత్ కొనుగోళ్లు, అదనపు వ్యయాలు, ఆదాయ లోటుల సర్దుబాటులో భాగంగా తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) మొత్తం రూ.7,635.22 కోట్ల ట్రూ-అప్ చార్జీల వసూలుకు అనుమతించినట్లు సమాచారం. ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరించనుండగా, మిగిలిన రూ.5,420.23 కోట్లను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి దశలవారీగా వసూలు చేయనున్నారు. ఇప్పటికే ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అదనపు విద్యుత్ బిల్లుల భారం మరింత భారంగా మారే అవకాశం ఉంది.విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను కొనసాగించేందుకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అవసరమైన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్ నుంచి కొనుగోలు చేయడంతో పాటు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై దృష్టి సారిస్తోంది. ఎత్తిపోతల పథకాలకు పీక్ అవర్స్‌కు బదులుగా ఆఫ్-పీక్ సమయాల్లో విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడం, నగరాల్లో సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడం, గ్రిడ్ నిర్వహణను మెరుగుపరచడం వంటి చర్యలను అమలు చేయాలని భావిస్తోంది.విద్యుత్ సమస్యలను అస్త్రంగా చేసుకుని ప్రతిపక్ష బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తోంది. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపిస్తోంది. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందిస్తూ గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన డిస్కంల బకాయిలు, ఆర్థిక సమస్యలే ప్రస్తుత పరిస్థితికి కారణమని వివరిస్తోంది. అయితే గత ప్రభుత్వాలపై విమర్శలు చేయడం కంటే ప్రస్తుత సమస్యలకు పరిష్కారం చూపించడమే ముఖ్యమని ప్రజలు భావిస్తున్నారు.దీర్ఘకాలికంగా విద్యుత్ కొరతను అధిగమించేందుకు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ మిగిలిన యూనిట్ల పనులను వేగవంతం చేయడం, సౌర విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను ప్రోత్సహించడం వంటి చర్యలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించిన బకాయిలను డిస్కంలకు సకాలంలో చెల్లించడం ద్వారా పంపిణీ సంస్థల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని భావిస్తోంది.ఒకవైపు నిరంతరాయ విద్యుత్ సరఫరా కల్పించాల్సిన బాధ్యత, మరోవైపు వేల కోట్ల రూపాయల ట్రూ-అప్ చార్జీలను ప్రజలపై మోపాల్సిన పరిస్థితి.. ఈ రెండింటి మధ్య రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇబ్బందికరమైన పరీక్షను ఎదుర్కొంటోంది. విద్యుత్ బిల్లుల భారం వినియోగదారుల్లో అసంతృప్తిని పెంచే అవకాశం ఉండగా, కోతలు కొనసాగితే ప్రజాగ్రహం మరింత పెరిగే ప్రమాదం ఉంది. రాబోయే పండుగలు, వ్యవసాయ సీజన్లలో విద్యుత్ సరఫరాను మెరుగుపరచడంతో పాటు అదనపు చార్జీల విషయంలో ప్రజలకు స్పష్టత ఇవ్వగలిగితేనే ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోగలదు. లేకుంటే విద్యుత్ కష్టాలు, ట్రూ-అప్ భారం రాజకీయంగా కాంగ్రెస్ సర్కార్‌కు పెద్ద తలనొప్పిగా మారే అవకాశం ఉంది.

భవిష్యత్ విద్యపై చర్చించిన కేంబ్రిడ్జ్



విజయవాడ, మహానగర్:

మారుతున్న ప్రపంచంలో విద్యార్థులను భవిష్యత్ అవకాశాలకు అనుగుణంగా తీర్చిదిద్దే విద్యా విధానాలపై చర్చించేందుకు కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ విజయవాడలో పాఠశాలల నాయకులతో సమావేశం నిర్వహించింది. జాతీయ, అంతర్జాతీయ విద్యా విధానాల మధ్య వ్యత్యాసాలు తగ్గుతున్న నేపథ్యంలో భారతీయ విద్యార్థులకు దేశీయంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన విద్యను అందించడంపై సమావేశంలో చర్చించారు. విమర్శనాత్మక ఆలోచన, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం, సృజనాత్మకత, సమర్థవంతమైన సమాచార వినిమయం వంటి నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరాన్ని విద్యావేత్తలు ప్రస్తావించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావంతో అభ్యసనం, మూల్యాంకనం, భవిష్యత్ ఉద్యోగాల్లో వస్తున్న మార్పులను పరిశీలించారు. కేంబ్రిడ్జ్ దక్షిణాసియా అంతర్జాతీయ విద్యా విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వినయ్ శర్మ మాట్లాడుతూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించగల, సమస్యలకు పరిష్కారాలు కనుగొనగల విద్యార్థులను తీర్చిదిద్దడంలో పాఠశాలల పాత్ర కీలకమన్నారు. గుంటూరులోని లయోలా పబ్లిక్ స్కూల్ ప్రాంతీయ విద్యా కార్యదర్శి మార్క్ సహాయరాజ్ ఈ సమావేశం విలువైన ఆలోచనలను అందించిందని తెలిపారు. విజయవాడలో జరిగిన ఈ సమావేశంలో 10 పాఠశాలలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. మార్చి 2026 పరీక్షల సిరీస్‌లో 447 పాఠశాలలకు చెందిన 23,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా, 91,000కు పైగా పరీక్షా ఎంట్రీలు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే మొత్తం ఎంట్రీలు 7 శాతం, కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఏఎస్ అండ్ ఏ లెవల్ ఎంట్రీలు 12 శాతం పెరిగాయి.

పార్కు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



అవనిగడ్డ, మహానగర్

స్థానిక తంగిరాల వీరరాఘవయ్య పార్క్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తంగిరాల వీరరాఘవయ్య పార్క్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన పార్క్ కళా విహీనంగా ఉండటం విచారకరం అన్నారు. పంచాయతీకి ప్రత్యేక అధికారుల పాలన వచ్చిన తరువాత పార్క్ అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాలలకు ఆట పరికరాలు, పెద్దలకు వ్యాయామ పరికరాలు పంచాయతీ నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ పెద్దలు, దాతలు పార్క్ సుందరీకరణలో భాగస్వామ్యం వహించాలని పిలుపునిచ్చారు. పార్కులో ఆకర్షణీయమైన మొక్కలు, పచ్చిక బయలు (లాన్) ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అవనిగడ్డ రెడ్ క్రాస్ సొసైటీ సహకరించేందుకు ముందుకు రావటం ముదావహం అన్నారు. గ్రామంలోని విద్యాసంస్థలు, గ్రామ పెద్దలు సహకారం అందించాలని కోరారు. అవనిగడ్డలో కాసేపు ఆహ్లాదంగా గడిపేలా పార్కును సుందరీకరించటంలో గ్రామస్థుల సహకారం అవసరం అన్నారు. పీ-4 స్ఫూర్తితో పార్కును అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, పంచాయతీ ఈఓ తోట శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, ఆర్యవైశ్య పెద్దలు పాల్గొన్నారు

శ్రీశైల దేవస్థానానికి

నాలుగు టన్నుల కూరగాయల వితరణ



విజయవాడ, మహానగర్

శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం అన్నప్రసాదం ట్రస్ట్‌కు నగరానికి చెందిన పల్సూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాలుగు టన్నుల కూరగాయలను విరాళంగా పంపించారు. ఈ కూరగాయలను తరలించే వాహనాన్ని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఆయన సతీమణి చందన బుధవారం ఉదయం రామవరప్పాడులోని ఎస్ఎల్వీ గ్రీన్ మెడోస్ వద్ద కొబ్బరికాయ కొట్టి, హారతి ఇచ్చి ప్రారంభించారు. అనంతరం వాహనం శ్రీశైలానికి బయలుదేరింది. దేవస్థానం అన్నప్రసాదం తయారీకి ఉపయోగపడేలా కూరగాయలను అందించేందుకు పల్సూరి నాగేశ్వరరావుతో పాటు నాగేంద్ర, బాలాజీ స్వీట్స్ శ్రీనివాస్ సహకరించారు. భక్తులకు అన్నప్రసాదం అందించే కార్యక్రమానికి దాతలు అందించిన ఈ విరాళం ఉపయోగపడనుంది.

బిజినెస్

మార్కెట్లోకి టయోటా నయా గ్లాంజా
ప్రారంభ ధర రూ.6.99 లక్షలు



న్యూఢిల్లీ : ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్.. దేశీయ మార్కెట్లోకి అత్యంత ప్రజాదరణ పొందిన హచ్‌బ్యాక్ గ్లాంజా ఫేస్‌లిఫ్ట్‌ను విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.6.99 లక్షలుగా నిర్ణయించింది. ఇప్పటికే బుకింగ్‌లు ఆరంభించిన్నట్టు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు. ఈ మాడల్‌లో వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, లెవల్ 2 అడాస్ ఫీచర్లు, 9 అంగుళాల టచ్‌స్క్రీన్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీల కెమెరా, హిల్‌హోల్డ్ కంట్రోల్ వంటి నూతన ఫీచర్లతో తీర్చిదిద్దింది.

గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌కు తరలిరండి
'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్-2026'లో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ : 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌కు అనుగుణంగా డిసెంబర్ 7-9 మధ్య 'తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ 2026'లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి.. 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్-2026'లో ఆయన చెప్పారు.

ఐడీబీఐ బ్యాంకులో వాటాల విక్రయం..
కేంద్రం షేర్ కెనడా కంపెనీ చేతికి!

ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యాంకులో 60.72 శాతం వాటాను రూ.52,878 కోట్లకు కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ అనుబంధ సంస్థ '10955230 కెనడా ఇంక్'కు విక్రయించేందుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం పూర్తయితే ఎయిరిండియా విక్రయం తర్వాత దేశంలోనే అతిపెద్ద వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణగా నిలవనుంది. ఐడీబీఐ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న 30.48 శాతం వాటా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)కి ఉన్న 30.24 శాతం వాటా కలిపి మొత్తం 60.72 శాతాన్ని ఫెయిర్‌ఫాక్స్ కొనుగోలు చేయనుంది. ఒక్కో షేరుకు రూ.81 చొప్పున ఈ బిడ్ దక్కించుకుంది. మొత్తం కొనుగోలు విలువ రూ.52,877.07 కోట్లుగా ప్రభుత్వం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఒప్పందం పూర్తయితే భారత ఆర్థిక రంగంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)గా నిలుస్తుందని కేంద్రం పేర్కొంది.



యాజమాన్య నియంత్రణ ఫెయిర్‌ఫాక్స్ చేతికి

ఐడీబీఐ బ్యాంకులో యాజమాన్య నియంత్రణను ప్రైవేటు సంస్థకు బదిలీ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ దీర్ఘకాలిక ప్రణాళిక ఈ నిర్ణయంతో ముందుకు సాగనుంది. అయితే, ఈ లావాదేవీ పూర్తవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతి కీలకం కానుంది. బ్యాంకును సొంతం చేసుకుని నిర్వహించేందుకు ఫెయిర్‌ఫాక్స్ అర్హతలను ఆర్‌బీఐ పరిశీలించనుంది. ఇందులో భాగంగా సంస్థపై 'ఫిట్ అండ్ ప్రాపర్' అంచనా వేయనుంది. ఫెయిర్‌ఫాక్స్‌కు ఇప్పటికే సీఎస్‌బీ బ్యాంకులో వాటా ఉంది. నిబంధనల ప్రకారం ఐడీబీఐ బ్యాంకు కొనుగోలు పూర్తయిన రెండేళ్లలోగా సీఎస్‌బీ బ్యాంకును ఐడీబీఐలో విలీనం చేయాలి లేదా సీఎస్‌బీ బ్యాంకులో తన వాటాను విక్రయించి బయటకు రావాలి. అలాగే ఐడీబీఐ బ్యాంకులోని మైనారిటీ వాటాదారుల కోసం ఫెయిర్‌ఫాక్స్ ఓపెన్ ఆఫర్ కూడా ప్రకటించాల్సి ఉంటుంది.

కేంద్రం, ఎల్ఐసీ వాటాలూ కొనసాగింపు

ఈ ఒప్పందం తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ ఐడీబీఐ బ్యాంకులో కొంత వాటాను కొనసాగించనున్నాయి. రాబోయే రెండేళ్లలో ఎల్ఐసీ వాటా 19 శాతం నుంచి 15 శాతానికి తగ్గే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ మిగిలిన వాటాను బహిరంగ మార్కెట్ ద్వారా విక్రయించనున్నారు. ఈ లావాదేవీని వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణగా కాకుండా 'వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణ'గా పరిగణించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. బ్యాంకులో కేంద్రం, ఎల్ఐసీ వాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈ ఒప్పందాన్ని పూర్తి చేయనున్నట్లు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపం) కార్యదర్శి అరుణీష్ చావ్లా పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు.

టీవీఎస్‌లో ఆస్తుల పంచాయతీ..
రచ్చకెక్కిన వేణు శ్రీనివాసన్ కుటుంబ విభేదాలు

న్యూఢిల్లీ : యాజమాన్య హక్కులు, వ్యాపార ఆస్తుల విభజన లెక్కలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయని శ్రీనివాసన్ భార్య మల్లికా శ్రీనివాసన్, కూతురు లక్ష్మీ వేణు చెప్తున్నారు. ఈ మేరకు తాజాగా విడుదలైన ఓ సంయుక్త ప్రకటనలో ఆ ఇరువురు స్పష్టం చేశారు. కుటుంబ విభేదాల పరిష్కారానికి ఎలాంటి ఫైనాన్షియల్ సెటిల్మెంట్ జరుగలేదని పేర్కొన్నారు. 'ఈ వివాదం టీవీఎస్ గ్రూపునకు చెందిన ఆయా కంపెనీల్లో హోదాలకు సంబంధించి కాదు. యాజమాన్య హక్కులు, న్యాయబద్ధమైన వారసత్వ గుర్తింపునకు సంబంధించినది' అన్నారు. అలాగే పారదర్శకంగా ఈ ప్రక్రియ జరుగడం లేదని ఆరోపించారు. టీవీఎస్ మోటర్ కంపెనీ, దాని హోల్డింగ్స్ సంస్థలో వారసత్వం అంశాలపై కుటుంబంలో అభిప్రాయ భేదాలున్నాయన్న వార్తల నడుమ మల్లిక, లక్ష్మీ ప్రకటన మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నదిప్పుడు. టీవీఎస్‌లో ఆస్తుల గొడవ.. వేణు శ్రీనివాసన్, ఆయన భార్య మల్లికా శ్రీనివాసన్, కూతురు లక్ష్మీ వేణు, కుమారుడు సుదర్శన్ వేణుల మధ్యే జరుగుతున్నది. ఈ వ్యవహారంలో తండ్రికొడుకులు ఒక గ్రూపైతే.. తల్లీకూతుళ్లు మరొక గ్రూప్. ఇక అసలు ఈ లొల్లికి కేంద్ర బిందువులు.. 2020 డిసెంబర్‌లో జరిగిన కుటుంబ ఒప్పందం, 2024 మార్చిలో చేసుకున్న అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ). అవును.. ఈ అగ్రిమెంట్లు కేవలం వ్యాపార నిర్వహణ కోసమేనని లక్ష్మీ వేణు అంటుండగా, కాదు.. ఆస్తుల యాజమాన్య బదిలీకి సంబంధినవి అని సుదర్శన్ వేణు అంటున్నారు. దీంతో ఇప్పుడు లక్ష్మీ వేణు కోర్టులకెక్కే ఆలోచనల్నీ చేస్తుండటం గమనార్హం. అయితే కంపెనీ చట్టాలు కూడా ఈ వ్యవహారంలో కీలకం కానున్నాయి. ఇక ఇప్పటికే సీనియర్ న్యాయవాదుల సమక్షంలో ఇరువర్గాలు భేటీ కూడా అయ్యాయి. వేణు శ్రీనివాసన్ వర్గం.. సదరు ఒప్పందాలు టీవీఎస్ హోల్డింగ్స్, టీవీఎస్ మోటర్ కంపెనీ యాజమాన్య హక్కులు సుదర్శన్‌కు వర్తిస్తాయని స్పష్టం చేస్తున్నట్లు చెప్తున్నది. అలాగే లక్ష్మీ వేణుకు సుందరం క్లేటన్, గ్రూప్‌నకు చెందిన చిన్న వ్యాపారాలు చెందుతాయని అంటున్నారు. అయితే లక్ష్మి ఈ వాదనను ఖండిస్తున్నారు. ఆ ఒప్పందాలు వ్యాపారపరమైన పాలనా విధుల కోసమేనని చెప్తున్నారు. యాజమాన్య హక్కుల బదిలీకి సంబంధించి నియమావళిని సూచించలేదని అంటున్నారు. కాగా, 2020 డిసెంబర్‌లో జరిగిన తొలి ఒప్పందంలో టీవీఎస్ వ్యవస్థాపకుడైన టీవీ సుందరం అయ్యంగార్ వారసులు రాజం, కృష్ణా, సంతానం, శ్రీనివాసన్, దొరైస్వామి శాఖల మధ్య నోటి మాట మీద కుదిరిన అవగాహనే. ఇది కుటుంబ శాఖల మధ్య నియంత్రణను పునర్వ్యవస్థీకరించడం, సంబంధిత వ్యాపార యాజమాన్యాల నిర్వహణను సమన్వయపర్చడం కోసమేనని చెప్తున్నారు. అయితే 2024 మార్చిలో కుదిరిన ఎంవోయూపై వేణు, మల్లిక, లక్ష్మి, సుదర్శన్ అంతా సంతకాలు చేశారు. ఇందులో టీవీఎస్ బ్రాండ్ వినియోగం, ఇతరత్రా అంశాలున్నాయి. అయినప్పటికీ టీవీఎస్ హోల్డింగ్స్ ఇందులో భాగం కాలేదు. కానీ 2025 ఏప్రిల్‌లో వేణు శ్రీనివాసన్.. టీవీఎస్ హోల్డింగ్స్‌లో ఉన్న 6.79 శాతం వాటాను వీఎస్ ట్రస్ట్‌కు బదిలీ చేసినట్టు స్టాక్ ఎక్స్చేంజీల వివరాలు చెప్తున్నాయి. అలాగే వీఎస్ ట్రస్ట్, శ్రీనివాసన్ ట్రస్ట్ రెండింటి ద్వారా టీవీఎస్ హోల్డింగ్స్‌లో బెనిఫీషియల్ ఓనర్‌గా సుదర్శన్ వేణును తదనంతర ఫైలింగ్‌లు ప్రకటించాయి.

భారత్ తడబాటు..
చేతులెత్తేసిన టీమిండియా

19.3 ఓవర్లలో 233 పరుగులు చేసిన టీమిండియా
ఆరంభంలో దూకుడు.. మధ్యలో కీలక వికెట్ల పతనం
ఐదు వికెట్లతో భారత బ్యాటింగ్ వెన్ను విరిచిన కీమో పాల్
నిరాశపర్చిన ఇషాన్, అయ్యర్, నమన్
బౌలింగ్‌లోనూ తేలిపోయిన భారత్

భారీ లక్ష్యం.. ఆరంభంలో దూకుడు.. మధ్యలో కీలక వికెట్ల పతనం.. చివర్లో కీమో పాల్ విజృంభణ! ఇలా ఎన్నో మలుపుల మధ్య సాగిన నాలుగో టీ20లో భారత్‌కు ఓటమి తప్పలేదు. తొలుత షాయ్ హోప్ శతకంతో విరుచుకుపడటంతో వెస్టిండీస్ 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు పోరాడినా, కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో విజయం అందలేదు. కీమో పాల్ నాలుగు ఓవర్లలో 41 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టి భారత బ్యాటింగ్ వెన్ను విరిచాడు. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లు రెండేసి విజయాలు సాధించాయి. బెంగళూరులో శనివారం జరగనున్న ఐదో మ్యాచ్ సిరీస్ డిసైడర్ కానుంది. 248 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు సంజూ శాంసన్ అదిరిపోయే ఆరంభం ఇచ్చాడు. అతడు కేవలం 23 బంతుల్లో 56 పరుగులు చేశాడు. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వేగంగా పరుగులు సాధిస్తూ భారత్ విజయంపై ఆశలు రేపాడు. అయితే కీమో పాల్ వేసిన ఓవర్‌లో శాంసన్ క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో భారత్‌కు తొలి ఎదురుదెబ్బ తగిలింది. ఇదే ఓవర్‌లో ఇషాన్ కిషన్ కూడా ఔటయ్యాడు. మూడు బంతులు ఎదుర్కొన్న అతడు ఆరు పరుగులే చేసి కీమో పాల్ బౌలింగ్‌లో జువెల్ ఆండ్రూకు క్యాచ్ ఇచ్చాడు. దూకుడుగా ఆడాల్సిన సమయంలో ఇషాన్ త్వరగా వెనుదిరగడం భారత్‌పై ఒత్తిడి పెంచింది. అభిషేక్ శర్మ 24 బంతుల్లో 29 పరుగులు చేశాడు. మూడు ఫోర్లు, ఒక సిక్సర్ బాదిన అతడిని గుడాకేశ్ మోటీ పెవిలియన్‌కు పంపాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 11 బంతుల్లో 16 పరుగులు చేసి శమర్ స్ప్రింగర్ బౌలింగ్‌లో జువెల్ ఆండ్రూకు క్యాచ్ ఇచ్చాడు. దీంతో భారత్ కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది.



తెలుగు కుర్రాళ్ల పోరాటం

మధ్య ఓవర్లలో తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి భారత ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టేందుకు ప్రయత్నించారు. తిలక్ దూకుడుగా ఆడుతూ సిక్సర్లతో స్కోరు వేగాన్ని పెంచాడు. అతడు 25 బంతుల్లో 45 పరుగులు చేశాడు. కానీ, షెపర్డ్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో పావెల్‌కు క్యాచ్ రూపంలో దొరికిపోయాడు. నితీశ్ కుమార్ రెడ్డి కూడా కీలక సమయంలో వేగంగా పరుగులు సాధించాడు. అతడు 20 బంతుల్లో 41 పరుగులు చేసి తిలక్ వర్మ తరహాలోనే భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసి పావెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే చివరి ఓవర్లలో పరుగుల వేగం పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో భారత బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. భారీ షాట్లు ఆడే ప్రయత్నంలో వికెట్లు కోల్పోవడంతో విజయావకాశాలు దెబ్బతిన్నాయి.

కీమో పాల్ ఐదు వికెట్ల విజృంభణ

చివరి ఓవర్లలో కీమో పాల్ భారత బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. వరుసగా వికెట్లు తీస్తూ ఛేదనను విండీస్ వైపు తిప్పాడు. నాలుగు ఓవర్లు వేసి 41 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. లక్ష్యం అందుకోవడం కష్టంగా మారడంతో భారత బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో క్యాచ్‌ల రూపంలో వికెట్లు సమర్పించుకున్నారు. చివరకు అర్ష్‌దీప్ సింగ్ రిటైర్డ్ హర్ట్ కావడంతో భారత్ ఇన్నింగ్స్ ముందుగానే ముగిసింది. భారత్ 19.3 ఓవర్లలో 223 పరుగులు చేసింది. భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో భారత బ్యాటర్లు చివరి వరకు పోరాడినా, కీమో పాల్ బౌలింగ్ ముందు నిలవలేకపోయారు.

హోప్ శతకం.. విండీస్‌కు భారీ స్కోరు

అంతకుముందు టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అయితే వెస్టిండీస్ బ్యాటర్లు భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. కెప్టెన్ షాయ్ హోప్ 50 బంతుల్లో 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లు ఉన్నాయి. ఆరంభం నుంచి చివరి వరకు దూకుడుగా ఆడుతూ భారత బౌలర్లకు కష్టాలు తెచ్చిపెట్టాడు. జువెల్ ఆండ్రూ 16 బంతుల్లో 21 పరుగులు చేసి జట్టుకు మంచి ఆరంభం ఇచ్చాడు. అతడిని అక్షర్ పటేల్ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన షిమ్రోన్ హెట్‌మైర్ కేవలం 12 బంతుల్లో 33 పరుగులు చేశాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతడిని ప్రిన్స్ యాదవ్ క్యాచ్ అండ్ బౌల్డ్‌గా ఔట్ చేశాడు. రోవ్‌మన్ పావెల్ 17 బంతుల్లో 24 పరుగులు చేశాడు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో సంజూ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరోవైపు షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ 26 బంతుల్లో 49 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. హోప్‌తో కలిసి చివరి ఓవర్లలో వేగంగా పరుగులు సాధించాడు. దీంతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లకు 247 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీశారు. మయాంక్ యాదవ్ నాలుగు ఓవర్లలో 52 పరుగులు ఇవ్వగా, అర్ష్‌దీప్ కూడా 52 పరుగులు సమర్పించుకున్నాడు. భారీ స్కోరును కాపాడుకోవడంలో విండీస్ బౌలర్లు విజయవంతమయ్యారు.

భారత ఓటమికి కీలక కారణాలు

శాంసన్ దూకుడు, తిలక్ వర్మ-నితీశ్ రెడ్డి పోరాటం ఉన్నప్పటికీ భారత్ లక్ష్యాన్ని అందుకోలేకపోయింది. ఇషాన్ కిషన్ త్వరగా ఔటవడం, శ్రేయస్ అయ్యర్ కీలక సమయంలో పెవిలియన్‌కు చేరడం, మధ్య ఓవర్లలో వికెట్లు పడటం భారత ఛేదనను దెబ్బతీశాయి. మరోవైపు హోప్ శతకం, రూథర్‌ఫర్డ్ వేగవంతమైన ఇన్నింగ్స్ వెస్టిండీస్‌కు భారీ స్కోరు అందించాయి. చివర్లో కీమో పాల్ ఐదు వికెట్లతో భారత బ్యాటింగ్‌ను దెబ్బతీయడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు.

స్పోర్ట్స్

బెంగాల్, గుజరాత్ గెలుపు



కోల్‌కతా : రంజీ ట్రోఫీని బెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్ విజయంతో ప్రారంభించాయి. ఎలైట్ గ్రూప్ 'సీ'లో భాగంగా కోల్‌కతాలో ఢిల్లీతో జరిగిన పోరులో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన బెంగాల్.. ప్రత్యర్థిని 9 వికెట్ల తేడాతో చిత్తుచేసింది. ఎలైట్ గ్రూప్ 'సీ'లోని మరో మ్యాచ్‌లో మహారాష్ట్ర.. సర్వీసెస్‌ను 127 పరుగులతో ఓడించింది. ఇదే గ్రూపులో ఉన్న గుజరాత్ సైతం.. ఒడిశాపై 10 వికెట్ల తేడాతో గెలిచి టోర్నీలో బోణీ కొట్టింది. కాగా డిఫెండింగ్ చాంపియన్ జమ్మూకాశ్మీర్ మాత్రం తొలి మ్యాచ్‌లో డ్రాతో గట్టెక్కింది. శ్రీనగర్ వేదికగా మధ్యప్రదేశ్‌తో జరిగిన పోరులో ఆ జట్టు నిర్దేశించిన 325 రన్స్ ఛేదనలో జమ్మూకాశ్మీర్ ఆఖరి రోజు 88/7తో ఆటను ముగించింది. ఆంధ్రాతో జరిగిన మ్యాచ్‌ను కర్నాటక డ్రా చేసుకుంది. తమిళనాడు, పంజాబ్, సౌరాష్ట్ర, కేరళ తమ మ్యాచ్‌లను డ్రా చేసుకున్నాయి.

కెరీర్ బెస్ట్ ర్యాంకుకు శ్రేయస్


దుబాయ్ : టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకున్నాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అతడు మూడు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. స్వదేశంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి పోరులో భారీ శతకంతో చెలరేగడంతో అతడి ర్యాంకు మెరుగైంది. దీంతో టాప్-4లో ఉన్న బ్యాటర్లలో ముగ్గురూ భారత ఆటగాళ్లే కావడం విశేషం. ఇషాన్ అగ్రస్థానాన కొనసాగుతుండగా అభిషేక్ సెకండ్ ప్లేస్‌లో ఉన్నాడు. పాకిస్థాన్ సారథి సాహిబ్‌జాదా ఫర్హాన్ మూడో స్థానం దక్కించుకోగా అయ్యర్ ఫోర్త్ ప్లేస్‌లో ఉన్నాడు.





దశావతారాల కథ 'హైందవ'

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న మిస్టికల్ డివోషనల్ థ్రిల్లర్ 'హైందవ' నవంబర్ 27న విడుదలకానుంది. మహేష్ చందు నిర్మాత. సంయుక్త మీనన్ కథానాయిక. బుధవారం టీజర్‌ను ఆవిష్కరించారు. రంగాపురం అనే గ్రామంలోని పురాతన ఆలయంలో విగ్రహాలన్నీ మాయం అవుతాయి. అదే సమయంలో గ్రామంలో ఓ వ్యక్తి హత్యకు గురవుతాడు. ఈ కేసుని పరిశోధించడానికి దేవుడిపై నమ్మకం లేని ఓ పోలీస్ అధికారిని నియమిస్తారు. ఈ నేపథ్యంలో చోటుచేసుకునే ఆసక్తికరమైన సంఘటనలతో టీజర్ ఆద్యంతం ఆసక్తిని పెంచింది. అద్భుతమైన కథ, విజువల్స్‌తో కూడిన మిస్టికల్ థ్రిల్లర్ ఇదని, ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ని అందిస్తుందని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తెలిపారు. దశావతార గుడి నేపథ్యంలో జరిగే కథ ఇదని దర్శకుడు పేర్కొన్నారు.



కథలు నచ్చక.. కాస్త విరామం!

తొమ్మిది నెలలుగా తాను ఒక్క చిత్రాన్ని కూడా అంగీకరించలేదని అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్ స్పష్టం చేసింది. అల్లు అర్జున్ 'రాకా' చిత్రంలో ఈ భామ కీలక పాత్రను పోషిస్తుందనే వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మృణాల్ ఠాకూర్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'గత తొమ్మిది నెలలుగా ఏ సినిమాకూ సంతకం చేయలేదు. ఆఫర్లు బాగానే వస్తున్నాయి. కానీ కథలు నా మనసుకు నచ్చడం లేదు. అందుకే సినిమాలకు విరామం తీసుకున్నా. ఒక సినిమా కోసం మూడునాలుగు నెలల సమయాన్ని వెచ్చించాల్సి వస్తున్నది. అంత సమయాన్ని కేటాయిస్తున్నామంటే కథలో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి కదా' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. 'రాకా' సినిమాలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నదని, ఆమె షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నదని ముంబై సినీ వర్గాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకూ చిత్రబృందం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.



'కల్కి 2' సెట్స్‌లోకి రెబల్ స్టార్ ప్రభాస్.. త్వరలో ప్రారంభం కానున్న భారీ షెడ్యూల్!

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ సీక్వెల్ చిత్రం 'కల్కి 2898 ఏడీ -- పార్ట్ 2' షూటింగ్‌కు సంబంధించి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ పౌరాణిక చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగం ఘనవిజయం సాధించడంతో, దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సీక్వెల్‌ను మరింత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన తదుపరి షెడ్యూల్ మరియు షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే ప్రభాస్ రేపటినుంచి ఈ సినిమా షూటింగ్ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ప్రభాస్ తన కీలక సన్నివేశాల షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు నటిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను 2027 నాటికి పూర్తి చేసి, భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రభాస్ కొత్త షెడ్యూల్ అప్‌డేట్‌తో ఆయన అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999